జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు
9000621111, 9440137451

సంపుటి 15 సంచిక 268 విశాఖపట్నం | సోమవారం 13 జూన్ 2022 | 8 పేజీలు | వెల : 5.00



# వైసిపిలో సమరమే..!

## ఎంపీలూ, ఎమ్మెల్యేల మధ్య ఏం జరుగుతోంది...?

ఒకే పార్టీకి చెందిన వారు అంతా ఉన్నారు. కనీసం విమర్శ చేసుకునేందుకు సోది లోకి అయినా ప్రత్యర్థి పార్టీ మనిషి గెలిచిన దాఖలా లేదు. జిల్లాలకు జిల్లాలూ వైసీపీ పరం అయ్యాయి. వారే ఎంపీలు వారే ఎమ్మెల్యేలు ఆఖరుకు టాప్ టూ బాటం చూస్తే సర్పంచు నుంచి వార్డు మెంబర్ వరకూ వారిదే హవా. నిజంగా ఇంతటి రాజకీయ అనుకూలత గతంలో ఎప్పుడూ చూడలేదు. అంతా ఒక్క చోట చేరి పచ్చగా హాయిగా ఉండాల్సిన పరిస్థితి.కానీ జరుగుతున్నది మాత్రం వేరుగా ఉంది. ఒకే పార్టీలో ఉన్నా కత్తులు వేరుగా ఉన్నరు. ఒకే ఒరలో ఆ రెండు కత్తులు ఒదగనంటున్నాయి. ఎలాగో పంటి బిగువున మూడేళ్ల పాటు బిగపట్టిన అసంతృప్తి బాధ వ్యధ అన్నీ కూడా ఇపుడు బయటపెట్టేసుకుంటున్నారు. నీదా నాదా అడ్డా అంటూ పందేలు కాస్తున్నారు. బస్తీమే సవాల్ అని ఒకరిని ఒకరు కాలు దువ్వి మరీ రచ్చకీడుస్తున్నారు. మచిలీపట్నం వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి వర్సెస్ మాజీ మంత్రి పేర్ని నాని ఎపిసోడ్ ఏపీలో వైసీపీ ప్రస్తుత రాజకీయ పరిస్థితితి అద్దం పడుతోంది. ఒక విధంగా ఇది మొత్తం ఏపీలో జరుగుతున్న ఈ తరహా వివాదాలను తెర ముందుకు తెచ్చిన ఒక ఉదాహరణగానే అంతా చూస్తున్నారు. పేర్ని నాని మంచిలీపట్నాన్ని తన అడ్డాగా చేసుకున్నారని బాలశౌరి ఆరోపిస్తున్నారు. బందరు ఆయన జాగీరా అని కూడా ప్రశ్నిస్తున్నారు.అంతే కాదు తాను అక్కడే ఉంటాను ఒక ఎంపీగా తనను అడ్డుకోవడం సొంత పార్టీ ఎమ్మెల్యేకు తగునా అని కూడా హూంకరిస్తున్నారు. ఇక పేర్ని నాని టీడీపీ మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావుకు ప్రాధాన్యత ఇస్తూ ఆయనతో తిరుగుతున్నారని సొంత పార్టీ వారిని నిరాదరణకు గురి చేస్తున్నారని కూడా బాలశౌరి బాంబులాంటి వార్తనే పేల్చారు.ఇదే కనుక నిజమైతే వైసీపీ హై కమాండ్ చూపు సారించాల్సిందే అని కూడా అంటున్నారు సరే బందరు ఇష్యూ ఇపుడు మీడియా సాక్షిగా బయటపడింది కాబట్టి హై కమాండ్ ఫోకస్ పెట్టవచ్చు. ఇద్దరినీ పిలిపించి మాట్లాడవచ్చు. కానీ ఏపీలో అన్ని చోట్లా ఇదే రకమైన పరిస్థితి ఉంది. అనకాపల్లి జిల్లాలో చూస్తే యువ మంత్రి గుడివాడ అమరనాథ్ కి అనకాపల్లి ఎంపీ సత్యవతికి అసలు పడదు. ఈ ఇద్దరు మధ్యన కూడా పచ్చగడ్డి వేస్తే మండుతోంది అంటారు. మాది తల్లీకొడుకుల అనుబంధం ఆమెతో తనకు వైరం ఏంటి అని యువ మంత్రి గుడివాడ అంటున్నా ఆచరణలో మాత్రం పొసగడంలేదు అనే చెబుతారు. ఒక ఆహ్వాన పత్రికలో ఎంపీ ఫోటోను గుడివాడ వర్గీయులు కావాలనే తీయించేశారు అన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇక అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మికి కూడా పడడంలేదు అన్న ప్రచారం ఉందిఈ ఇద్దరు మహిళా నేతలు ముఖాముఖాలు చూసుకోరని కూడా అంటారు. పక్కా ఆధిపత్య పోరు ఇద్దరు మధ్యన నడుస్తోందని అంటారు. దాంతో ఎడముఖం పెడముఖంగా అల్లూరి జిల్లా ఏజెన్సీ రాజకీయాలు సాగుతున్నాయని అంటారు. ఈ వివాదం అలాగే ఇప్పటికీ ఉందని కూడా చెబుతారు. గోదావరి జిల్లాలలో చూస్తే రాజమండ్రీ ఎంపీ మార్గాని భరత్ కి స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు మధ్య గొడవలు చాలా కాలంగా ఉన్నాయి. ఆయన మాట ఈయన వినరు ఈయన తోవలోకి ఆయన రారు. (మిగతా 2లో..)

# వెంకాయమ్మ కుటుంబంపై దాడి హేయం..

## నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: చంద్రబాబు

అమరావతి, : గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరులో వెంకాయమ్మ కుటుంబంపై జరిగిన దాడిని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో వైకాపా పరిపాలనలో విమర్శిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితం వెంకాయమ్మపై దాడి చేశారని, ఇప్పుడు ఆమె కుమారుడిపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దళిత మహిళపై దాడులు కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఒక కుటుంబంపై అరాచక శక్తులు పదేపదే దాడులకు పాల్పడుతున్నా.. అడ్డుకోకపోవడం మీ వైఫల్యం కాదా



అని పోలీసులను నిలదీశారు. కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి లేఖ.. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై వైకాపా దాడులు పరిపాటిగా మారాయని, దూషణలు, బెదిరింపులు, హత్యల ద్వారా విమర్శించే వారిని భయాందోళనలకు గురిచేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. వెంకాయమ్మ కుటుంబంపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదివారం డీజీపీకి ఒక లేఖ రాశారు. పోలీస్ అధికారుల సహకారంతోనే ఈ తరహా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. గత నెల 16వ తేదీన వెంకాయమ్మపై దాడి జరిగినా చర్యలు తీసుకోలేదని ఈ నేపథ్యంలో తాజాగా ఆమె కుమారుడిపై దాడి జరిగిందని పేర్కొన్నారు. తృటిలో వెంకాయమ్మ కుమారుడు వంశీ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని తెలిపారు. వెంటనే వెంకాయమ్మ కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేఖతో పాటు సంఘటనకు సంబంధించిన కొన్ని వీడియోలను చంద్రబాబు జతచేసి డీజీపీకి పంపారు.

# రాష్ట్రపతి అభ్యర్థిపై ఏకాభిప్రాయ సాధనలో నడ్డా, రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికకోసం అధికార, విపక్ష పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. యుపిఏ, యుపిఏ యేతర పక్షాలతో చర్చలు జరిపే బాధ్యతను భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్రమంత్రి రాజనాథ్ సింగ్ కు ఎన్‌డీఏ అప్పగించింది. జూన్ 15 తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. కాంగ్రెస్ పార్టీతో పాటు యూపిఏ అనుకూల పార్టీలు, తటస్థంగా ఉన్న పార్టీల నేతలతో నడ్డా, రాజ్‌నాథ్ చర్చలు జరుపుతారు. మరో వైపు రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక కోసం, భావసారూప్య పార్టీలతో చర్చల కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజ్యసభలో విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేను ఎంపిక చేశారు. ఆయనకే సమన్వయ బాధ్యతలు కూడా అప్పగించారు. అటు రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక కోసం 22 మంది విపక్ష నేతలకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ లేఖలు రాశారు. జూన్ 15న ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై మమతా నేతృత్వంలో వీరంతా సమావేశమై చర్చిస్తారు. ఎన్డీయే తరపున రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే విషయంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.

# గవర్నర్‌తో కేంద్ర మంత్రి భారతీపవార్ భేటీ..



అమరావతి, : రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరి చందన్‌తో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ పవార్ భేటీ అయ్యారు. ఆదివారం రాజ్‌భవన్‌కు వచ్చిన మంత్రికి రాజ్‌భవన్ ఉప కార్యదర్శి డాక్టర్ సన్యాసి రావు స్వాగతం పలికారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన డాక్టర్ భారతి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దేశంలోని సమకాలీన రాజకీయ అంశాలపై వీరిద్దరూ చర్చించుకున్నారు.కేంద్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు, నూతన పథకాలను గురించి కేంద్ర మంత్రి గవర్నర్ కు వివరించారు. రాష్ట్రంలో అయా పథకాల అమలు తీరును పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి డాక్టర్ పవార్ తో పాటు– ఆమె భర్త ప్రవీణ్ అర్జున్ పవార్ కూడా ఉన్నారు. వీరిరువురినీ గవర్నర్ శాలువా, మోమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజ్ భవన్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరి తీరంలో ఆగిపోయిన క్రూయిజ్ షిప్..

## పర్మిషన్ ఇవ్వని లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై



ఆంధ్రప్రదేశ్ నుంచి పుదుచ్చేరి మధ్య పర్యాటకులను తిప్పేందుకు ఏర్పాటు చేసిన క్రూయిజ్ షిప్‌ని పుదుచ్చేరికి రాకుండా అడ్డుకున్నారు అక్కడి అధికారులు. మొన్న ఏపీ మంత్రి రోజా ఈ షిప్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. అయితే ఇందులో క్యాసినో, గ్యాంబ్లింగ్ వంటివి నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఈ షిప్‌ని తమ ఏరియాలోకి రాకుండా పుదుచ్చేరి అధికారులు అడ్డుకున్నారు. ఫస్ట్ టైమ్ అడ్డుకున్న అధికారులు ఇవ్వాల రెండోసారి కూడా అట్లాగే షిప్‌ని రాకుండా నిలువరించారు. ఏపీ, పుదుచ్చేరి మధ్య క్రూయిజ్ షిప్ వివాదం కొనసాగుతూనే ఉంది. మరోసారి పుదుచ్చేరి తీరంలో నౌకను ఆపేశారు అధికారులు. అయితే దీనికి అనుమతి లేదన్నారు లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్. ఆ షిప్‌లో క్యాసినో, గ్యాంబ్లింగ్ జరగడం లేదని నిర్ధారించిన తర్వాతే అనుమతంచాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండోసారి కూడా షిప్ సముద్రంలోనే ఆగిపోవాల్సి వచ్చింది.

# శుక్రవారం హింసాకాండ నిందితుని చట్టవిరుద్ధ ఇల్లు కూల్చివేత

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం బుల్డోజర్ న్యాయం చేస్తోంది. బీజేపీ మాజీ నేత నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన హింసాకాండకు సూత్రధారి, రాజకీయ నేత జావేద్ మహమ్మద్ చట్టవిరుద్ధంగా నిర్మించిన ఇంటిని ఆదివారం కూలదోసింది. శుక్రవారం జరిగిన హింసాకాండలో దుండగులు దాదాపు రెండు చోట్ల పెద్ద ఎత్తున రాళ్ళ వర్షం కురిపించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తేవడానికి పోలీసులకు దాదాపు 5 గంటలు పట్టింది. జావేద్ ఎటువంటి అనుమతులు లేకుండా ఈ ఇంటిని నిర్మించినట్లు ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థ అధికారులు జారీ చేసిన నోటీసులో తెలిపారు. జావేద్‌కు మే నెలలోనే నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చేయడానికి జూన్ 9 వరకు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. భారీ బందోబస్తు నడుమ రెండు బుల్డోజర్లతో ఈ ఇంటిని కూల్చేవేసే పనులను ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఇంట్లోని ఏసీ, కూలర్, ఫ్రిజ్ వంటి సామగ్రిని పురపాలక సంఘ సిబ్బంది బయటకు తీసుకొచ్చి, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పెట్టారు. అనంతరం ఇంటి ప్రహరీ గోడ, తలుపులను బుల్డోజర్లతో



తొలగించారు. ఇదిలావుండగా, జావేద్ కుమార్తె అఫ్రీన్ ఫాతిమా సామాజిక కార్యకర్త అని తెలుస్తోంది. నూపుర్ శర్మ బీజేపీ అధికార ప్రతినిధి హోదాలో ఓ టీవీ చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రవక్త మహమ్మద్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆమెపై నమోదైన కేసులో దర్యాప్తునకు హాజరుకావాలని ఆమెను మహారాష్ట్ర పోలీసులు కోరారు.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# వైసిపిలో సమరమే..!

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఇద్దరు మధ్యన అధినాయకత్వం పంచాయతీ పెట్టి మరీ అప్పట్లో రాజీ కుదిర్చినా కూడా ఇంకా సీన్ అలాగే ఉంది అంటారు. అలాగే కాకినాడ ఎంపీ వంగా గీతకు లోకల్ ఎమ్మెల్యేలతో విభేదాలు ఉన్నాయి.పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన నియోజకవర్గంలో ఎంపీ పర్యటించడం మీద అభ్యంతరాలు చెబుతూ ఉంటారు. నా నియోజకవర్గంలో భాగమైన పిఠాపురంలో నేను టూర్ చేయడానికి ఒకరి అనుమతి అవసరమా అని ఎంపీ గీత గద్దిస్తున్నారు అని టాక్. ఆమె చూపు పిఠాపురం సీటు మీద ఉందనే ఇలా ఎమ్మెల్యే గరం గరం అవుతున్నారు అని కూడా ప్రచారంలో ఉంది.ఇక నరసారావుపేట ఎంపీ లావు శ్రీక్రిష్ణదేవరాయలకూ లోకల్ ఎమ్మెల్యేలకు మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. ఎంపీని ఏ కార్యక్రమానికి పిలవడంలేదని పట్టించుకోవడంలేదని వాపోతుంటారు. ఆయన ఈ మధ్య మంత్రుల బస్సుయాత్రలో భాగంగా నరసారావుపేటలో జరిగిన సభకు సైతం డుమ్మా కొట్టారు. ఆయనకూ మంత్రి విడదల రజనీకి మధ్య కూడా గ్యాప్ ఉంది అంటారు.మరో వైపు చూస్తే నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డికి లోకల్ ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ ఉంది అంటారు. ఆయన కూడా కేవలం ఎంపీ కావడం కోసమే వైసీపీలోకి ఫిరాయించి మరీ గెలిచారు కానీ వైసీపీ ఎంపీగా లోకల్ లీడర్లతో ఎపుడూ కలసిపోయే ప్రయత్నం చేయడంలేదు అని అంటారు. ఆయన చూపు టీడీపీ మీద ఉందని కూడా టాక్ నడుస్తోంది.ఇక ప్రకాశం జిల్లా విషయానికి వస్తే అక్కడ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కూడా స్థానిక ఎమ్మెల్యేలు తనతో కలసి సాగడంలేదని దేనికీ పిలవడం లేదని అంటూ ఉంటారు. ఆయన కూడా ఇపుడు ఫుల్ సైలెంట్ గా ఉంటున్నారు. రానున్న రోజులల్లో పరిస్థితులకు అనుగుణంగా తన రాజకీయాన్ని చేసుకోవాలని చూస్తున్నట్లుగా చెబుతారు.చిత్తూరు జిల్లాలో ఎంపీ ఎన్ రెడ్డప కూడా ప్రోటోకాల్ వివాదం విషయంలో ఎపుడూ ఆవేదన చెందుతూ ఉంటారని అంటారు. లోకల్ ఎమ్మెల్యేలు ఏ సమాచారం ఇవ్వడంలేదని కూడా ఆయన అనుచరులు మధన పడుతూ ఉంటారు. కొన్ని సార్లు ఇది బాహాటం అయింది కూడా. సీమ జిల్లాల్లో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కి లోకల్ ఎమ్మెల్యేలకు ఎడం ఉంది. అలాగే అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అయినా కర్నూల్ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ అయినా ఎమ్మెల్యేలతో కలసి సాగలేక మౌన ముద్ర దాలుస్తున్నారు అంటే గ్యాప్ అయితే ఉందనే అంటారు. మరి ఎంపీకి అదే నియోజకవర్గం ఎమ్మెల్యేదీ అదే చోటు. కానీ అధికారాలు వర్గాలు పేరిట రచ్చ రాజుకుంటూనే ఉంటుంది. ఇంకో వైపు కొందరు ఎంపీలు ఎమ్మెల్యేలుగా పోటీకి సేఫ్ జోన్ గా సీట్లు ఎంపిక చేసుకోవడం వల్ల కూడా వివాదాలు పెచ్చరిల్లుతున్నాయి మొత్తానికి చూస్తే ఒకే పార్టీ ఒకే జెండా ఒకే నీడన ఉన్నా ప్రత్యర్థుల కంటే దారుణంగా మాటల బాంబులు పేల్చుతున్నారు. ఇదే తీరు కనుక కొనసాగితే ఇద్దరికీ ముప్పే అంతిమంగా పార్టీకే అతి పెద్ద రాజకీయ ప్రమాదం ఏర్పడుతుంది అంటున్నారు వైసీపీ వర్గాలు. సో అధినాయకత్వం జోక్యం చేసుకోవాల్సిందే అంటున్నారు.

## గోగులమూడి శౌరమ్మా సంస్కరణ సభ పాల్గొన్న మాల మహానాడు నాయకులు



ఉంగుటూరు ప్రజాపాలన ప్రతినిధి : ప్రముఖ అంబేద్కర్ వాది గోగులమూడి కోటిప్రకాష్ తల్లి గారైన స్వర్గీయ గోగులమూడి శౌరమ్మా సంస్కరణ సభ పెద్ద అవుటపల్లి లో జరిగింది ఈ సభకు పీవీ రావు మాల మహానాడు కృష్ణా ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు గోగులమూడి రాజు పాల్గొని తొలుత ఆమె పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజన విముక్తికై బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో సామాజిక రాజకీయ ఉద్యమాల్లో పని చేసే బిడ్డలను సమాజానికి అందించిన శౌరమ్మ గారి లాంటి తల్లులు బహుజన సమాజానికి ఆదర్శం అని రాజు కొనియాడారు. ఈ సభలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు జీవి రత్నం.వర్రె చిట్టిబాబు. కోమవారపు ప్రసాద్. నియోజకవర్గ నాయకులు సరిహద్దు అంతోని. ఉదయ్ భాస్కర్. రాపల్లి విల్సన్. సురేష్. తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## విజయసాయి వర్సెస్ రఘురామ



అమరావతి: ట్విటర్‌లో ఎంపీ విజయసాయిరెడ్డి వర్సెస్ ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నట్లుగా తలపడ్డారు. రఘురామపై విజయసాయి ట్వీట్స్ తీవ్ర విమర్శలు చేశారు. విజయసాయికి అంతే ధీటుగా రఘురామ కౌంటరిచ్చారు. “అవును నాకున్నది విగ్గు.. ఎన్ని తన్నులు తిన్నా నీకు లేనిది సిగ్గు. కొత్తగా రాజీనామా అంటున్నారు.. నువ్వు.. నీ గ్యాంగ్ లీడర్.. అనర్హత వేటుపై చేతులు ఎత్తేశారా?. నేను ఏపీకి వస్తే సీఎంకు మైండ్ బ్లాక్ అవ్వుద్దనేగా.. నాపై కేసులు పెట్టిస్తున్నారు” అని ట్విటర్‌లో రఘురామకృష్ణరాజు పోస్టు చేశారు.

# దేశ ప్రజలందరికీ గుర్తుండేలా అల్లూరి జయంతి వేడుకలు

## కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



భీమవరం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి): అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల నిర్వహణకు కమిటీని ఏర్పాటుచేసి దేశ ప్రజలందరికీ గుర్తుండిపోయే విధంగా జయంతి వేడుకలను నిర్వహించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సూచించారు..ఆదివారం భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కళాకేంద్రంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల నిర్వహణ, ప్రధానమంత్రి రాక ఏర్పాట్లపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఉద్యమాలు, పోరాటాలు చేసి బలిదానమయ్యారని అల్లూరి చరిత్రపుటల్లో ఉండి చాలామందికి తెలియని వ్యక్తి అని అటువంటి వ్యక్తి గురించి దేశంలో అందరికీ తెలిసే విధంగా ఆయన 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించాలనేది మన ప్రధాని సంకల్పమని ఆన్నారు. అల్లూరి సీతారామరాజు పుట్టిన ప్రాంతం, చదువుకున్న ప్రాంతం, సంచరించిన ప్రాంతం, నివసించిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. సీతారామరాజు జయంతి ఉత్సవాలు ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో కూడా పెద్ద నిర్వహించడానికి ఆలోచన చేయడం జరిగిందని ఈకార్యక్రమానికి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి ఉత్సవాల పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. .భీమవరంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని జిల్లాల ప్రజా ప్రతినిధులు వివిధ కమిటీల ఏర్పాటులో భాగస్వాములు కావాలని అన్నారు. విశాఖపట్నంలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఉత్సవాల ముగింపునాటికి దీన్ని పూర్తిచేసుకుని ప్రారంభించాలని లక్ష్యంగా చేసుకున్నామని అన్నారు. అల్లూరి పోరాటాల గురించి అందరికి తెలియజేయాలని అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల నిర్వహణకు అందరూ కలిసి రావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీనుండి వచ్చే నెల 4వ తేదీ వరకు 8 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటం తెలిపే విధంగా రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా అందరూ కలిసి ఈకార్యక్రమం నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల నిర్వహణకు అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు. రవిప్రకాష్ జాయింట్ కలెక్టర్ జెవి మురళి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు , క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పి. సర్రాజు, మాజీ మంత్రులు కామినేని శ్రీనివాస్ , కనుమూరి బాపిరాజు, గోకరాజు రంగరాజు, శ్రీనివాసరాజు, సుబ్బరాజు, నరసింహరాజు, భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం చేస్తానని మాయ మాటలు చెప్పి..

# నేడు అదే మద్యంపై వేల కోట్లు అప్పులు తెస్తున్న జగన్ రెడ్డి

## పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ శాసన సభ్యులు జి.వి.ఆంజనేయులు



వినుకొండ జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి):వినుకొండ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడిన పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మరియు వినుకొండ మాజీ శాసన సభ్యులు జి.వి.ఆంజనేయులు.అభివృద్ధి చేసి ఆదాయమ పెంచలేని ఈ జగన్ రెడ్డి కరోనా అని చెప్పి అన్ని షాప్ లను మూయించి మద్య దుకాణాలు వద్ద ఉపాధ్యాయులను ఉంచి మాద్యం అమ్మించిన ఘనుడు అని సంపూర్ణ మద్యపాన నిషేధం అంటే మద్యం ఆదాయం రూ.9 వేల కోట్ల నుంచి రూ.22 వేల కోట్లకు పెంచుకుని ఆ రాబడి చూపించి రూ.8 వేల కోట్ల బాండ్లు బజార్లో అమ్ముకోవటమామద్యంపైవచ్చే ఆదాయంతో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న జగన్ రెడ్డి మద్యపాన నిషేధం చేస్తాడా.సొంత మాద్యం తయారీ చేసి పిచ్చి మందుతో నకిలీలు పెట్టి అమ్మి ప్రజల ప్రాణాలు తీస్తున్న జగన్ రెడ్డి.మద్యంసీసాలు ముట్టుకుంటే ప్రజలకు షాక్ కొట్టేలా చేస్తానని ధరలు పెంచి, అయినకాడికి దోచుకున్నాడు. ఆడబిడ్డల జీవితాలను రోడ్లపాలుచేసినవ్యక్తి జగన్ రెడ్డి,ఈరోజు నిత్యావసర సరుకులు ,రెట్లు పెంచి ఈమూడు సంవత్సరములలో 2 లక్షల కోట్లు దోచుకున్నారు.ఇలా దోచుకున్న వేలకోట్లు మీద సిబిఐ ఎంక్వయిరీ వేయాలని డిమాండు చేస్తున్నాను అని అన్నారు.దేశంలో ఎక్కడ తిరిగినగాని అప్పులు పుట్టే పరిస్తితి లేదని ఇది రాస్తానికే అవమానమని యువతరం బావిషత్తు ఏమి కావాలని రాష్ట్రము అభివృద్దిలో 30 సంవత్సరములు వెనక్కి పోయిందని అన్నారు.మూడేళ్ల పాలనలో మహిళల తాళిబొట్లు తాకట్టు పెట్టి మరీ ఈ ముఖ్యమంత్రి రూ.30వేలకోట్లు పోగేసుకున్నాడు అని జగన్ రెడ్డి మాటతప్పుడు, మడమతిప్పుడు అని ఎవరైనా అంటే మహిళలు వారికి చీపుర్లు, చెప్పులతో సమాధానంచెప్పాలి. అభివృద్ధి తెలియని జగన్మోహన్ రెడ్డి, రాష్ట్రంలోని సంక్షేమం పేరు చెబుతూ, కొన్ని చోట్ల వాలంటీర్లతో కూడా నాటుసారా అమ్మిస్తున్నాడు. కరోనా సమయంలో పిచ్చిమద్యం,శానిటైజర్ తో సంభవించిన మరణాలన్నీ జగన్మోహన్ రెడ్డి చేసిన హత్యలే.గత ఎన్నికల ముందు జగన్ రెడ్డి ఓ మాట చెప్పాడు. నేను విన్నాను , నేను ఉన్నాను అనే వాడు.అధికారం వచ్చాక నేను ఉన్నాను , విన్నవన్ని మర్చిపోయాను అంటున్నాడు. ప్రస్తుతం జగన్ రెడ్డి నినాదం నేను ఉన్నాను,నేను మర్చిపోయాను ,జగన్ రెడ్డి చెప్పేదంతా అబద్ధం చేసేదంతా మోసం అని. తల్లి ని , చెల్లి ని ఇంటి నుంచి వెళ్లగొట్టినోడికి పేద ప్రజల ఓ లెక్క.బాబాయ్ హత్య చేయించునోడికి పేదోడి ప్రాణం ఓ లెక్క.జగన్ రెడ్డి మద్యం దాహానికి వచ్చిని కాపురాలు నాశనం అవుతున్నాయి అని జగన్ రెడ్డి అమ్మే పిచ్చి మందు తాగి మహిళలు పై అత్యాచారాలు పెరిగిపోయాయి.మహిళల ఉసురు కొట్టుకోని జగన్ సీఎం మట్టి కరుచుకుపోయే రోజులు వచ్చాయి అని అన్నారు.వినుకొండ లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గ్రామాలలో ఆదిపత్యం కోసం అధికారాన్ని అడ్డపెట్టు కొని పోలీసులను అడ్డం పెట్టు కొని గొడవలు సృష్టిస్తున్నారుఅని. గతములో పోలీసుల చేత మీటింగ్ లు ఏర్పాటు చేసి శాంతి యుత కమిటీలు వేసి ఫ్యాక్షన్ గ్రామంలో గొడవలు లేకుండా చర్యలు తీసుకున్నామని,పార్టీ కార్యకర్తలుపై తప్పుడు కేసులు పెట్టి వేదించడం బ్యానర్లు మీరే చించి మా టిడిపి కార్యకర్తలు పై కేసులు పెట్టడం.ఇటువంటి సిగ్గుమాలిన పనిని మానుకోవాలని కొన్ని గ్రామాలలో ప్రజలలు సేవ చేసే పక్రియలో బాగం గా శివశక్తి ఫౌండేషన్ ద్వారా సిమెంట్ బెంచీలు ఏర్పటి చేయడం జరిగింది.రాజకీయం గా ఎదుర్కొనే ధైర్యం లేకా బల్లాలు పగల గొట్టడం అలాగే శిలాపలకాలు పగలగొట్టించిన బొల్లా బ్రహ్మనాయుడు.పురాణాలలో లోకకల్యాణం కోసం రాక్షసులుని చూసాము అనాడు యజ్ఞాలు చేసేటప్పుడు జరగకుండా చెడగొట్టే వారు ఇప్పుడు వైసిపి కుడా మంగళగిరిలో పేదవాడు కోసం లోకేష్ గారు అన్నా క్యాంటిన్ లు ఏర్పాటు చేస్తే వాటిని ద్వసం చేయడం రాక్షసులు కన్నా దారుణం అని ఈ సందర్భముగా అన్నారు.ఇంకా ఈ సమావేశం లో పి.వి.సురేష్,మీసాల మురళి కృష్ణ యాదవ్ ,బచ్చు అంజిరెడ్డి , రోడ్డా వీరాంజనేయ రెడ్డి,అమ్రుతపుడి కోటయ్య పాల్గొన్నారు.

## రేషనలైజేషన్ జీవో నంబర్-117ను సవరించాలి: పండితపరిషత్ వినుకొండశాఖ



వినుకొండ జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి): రేషనలైజేషన్ జీవో నంబర్-117. ను సవరించాలి. పండితపరిషత్‌బివినుకొండశాఖపాఠశాల విద్యా శాఖ జారీ చేసిన రేషనలైజేషన్ జీవో నెంబర్ 117 ప్రకారం 17 సెక్షన్లకు కేవలం ఒకే హిందీ పోస్టు కేటాయించడం వల్ల హిందీ భాషకు, హిందీ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం చేకూరుతుందని , సీసీఈ పద్ధతిలో 17 సెక్షన్లకు ఒకే ఒక ఉపాధ్యాయుడు పాఠ్యాంశాల బోధన, నోట్స్ దిద్దడం, ప్రాజెక్టు పని, పుస్తక సమీక్ష, పరీక్ష పేపర్లు దిద్దడం ఇవన్నీ ఒక ఉపాధ్యాయుడు చేయడం సాధ్యం కాదని , దీనివలన విద్యార్థులలో హిందీ భాషా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటాయని , హిందీ ఉపాధ్యాయులకు కూడా తీవ్ర ఒత్తిడి ఉంటుందని తెలిపారు.గతంలో జరిగిన రేషనలైజేషన్ లో జీవో నెంబర్ 29లి ద్వారా హిందీకి 281 విద్యార్థులకులి అదనపు పోస్ట్ కేటాయించారు.ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 2020లో జరిగిన రీఅపోర్షన్మెంట్ లో కూడా జీ వో నెంబర్ 53 ద్వారా 281 విద్యార్థులకు రెండవ హిందీ పోస్ట్ కేటాయింపు కొనసాగించారు.ప్రస్తుతం కూడా దాన్ని యథాప్రకారం కొనసాగించాలని వినుకొండ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ శాఖ పక్షానలి నాగ మునెయ్య, మరియదాస్, లచ్చానాయక్, శంకరరావు,రవి , రామకోటేశ్వరరావు, కె వి ఆర్ పి .రంగనాథ్ డిమాండ్ చేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు



నరసాపురం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : శనివారం రాత్రి సమయంలో నరసాపురం పట్టణ పరిసర ప్రాంతాలలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా సంచరిస్తున్న 34 మంది యువకులను నరసాపురం పట్టణ ఎస్ఐ కె.సుధాకరరెడ్డి అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వారందరిపై న్యూసెన్సు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపారు. ఇకపై ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ అనైతిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## జగనన్న బాదుడు అంటే భయపడుతున్న జనం



నరసరావుపేట.జూన్ 12.(ప్రజాపాలన ప్రతినిధి): రాష్ట్రాన్ని వైసీపీ సర్వ నాశనం చేసింది మూడేళ్లలో 7 సార్లు విద్యుత్ చార్జీల పెంపుతో పాటు మూడు సార్లు ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచారు అని నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు.వైసీపీ పాలనలో ప్రజలు పీకల్లోతు కష్టాల్లో మునిగి ఆదాయాలు లేక ఖర్చులు పెరగడంతో బతకటం భారంగా మారిందని ప్రజలు వాపోతున్నారుబిఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నామంటూ..ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లినరసరావుపేట మండలం:- నరసరావుపేట మండలం పెద్దతురకాపాలెం నందు బాదుడే. బాదుడు..కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ నాయకులు,మహిళ నేతలు,పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాల పై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేసి బాదుడే బాదుడు కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీరవాలి,జిలాని, ఇమాంసా, గౌస్, దరియవలి,గౌస్ పీర్,మాబు షెయిద్,మస్తాన్,గౌస్ పీర్,సయ్యద్ గౌస్,హుస్సేన్,చవపాటి మస్తాన్,గాలిబ్,పల్నాటి సైదా మరియు టీడీపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంపీ బాలశౌరిపై మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఘాటు వ్యాఖ్యలు

మచిలీపట్నం టౌన్ 12 , ప్రజాపాలన ప్రతినిధి :బందరు పార్లమెంట్ సభ్యుడు, వల్లభనేని బాలశౌరి తనపై లేనిపోని ఆరోపణలు చేసినందుకు తనకు క్షమాపణ చెప్పాలని, టీడిపి మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు, కొనకళ్ల నారాయణరావు డిమాండ్ చేశారు.ఆదివారం, మచిలీపట్నంలో తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంటు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు, కొనకళ్ల నారాయణరావు నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో మాట్లాడుతూ తాను కళాశాల కమిటీ చైర్మన్ గా ఉన్న హిందూ కళాశాల అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి



35 లక్షల నిధులు అందజేశారు.ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ప్రారంభించేందుకు కాలేజీ కమిటీ తరపున రాజ్యసభ సభ్యుడు, సుజనా చౌదరి ని ఆహ్వానించామన్నారు.ప్రోటోకాల్ లో భాగంగా ఎంపీ బాలశౌరి ని, ఎమ్మెల్యే పేర్ని నాని ఆహ్వానించామని, ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఎంపీ బాలశౌరి ని ఆహ్వానించామని, ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకం లో, ఆహ్వాన పత్రికలలో ఎంపీ బాలశౌరి పేరుకూడా వేశామన్నారు.కళాశాల ఫంక్షన్ కు రాకుండా బాలశౌరి రాజకీయం చేస్తున్నారన్నారు.తనకు వైసీపీ నాయకులు, పేర్ని నాని ల మధ్య ఏ విధమైన రాజకీయ సంబంధాలు లేవన్నారు. పేర్ని నాని, వైసీపీ శ్రేణులు తనకు రాజకీయ ప్రత్యర్థులు అన్నారు.ప్రోటోకాల్ ప్రకారం మే శాసనసభ్యుడు పేర్ని నాని ని కళాశాల కార్యక్రమానికి ఆహ్వానించాము అన్నారు.హిందూ కళాశాల క్రీడా ప్రాంగణానికి తాను ఎంపీగా ఉన్న సమయంలో జిమ్ నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు ఇచ్చానని, ఆ నిధులను వెనక్కి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఎంపీ బాలశౌరి లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు.టెండర్ ఖరారైన తర్వాత నిధులను డైవర్ట్ చేయడం విడ్డూరంగా ఉంది అన్నారు.దీనిపై తాను కూడా కలెక్టర్ కు, పార్లమెంట్ స్పీకర్ కు లేఖ రాస్తానని అన్నారు.వారానికి ఒక్కసారి ఎమ్మెల్యే పేర్ని నాని తో తాను మాట్లాడుతున్నట్లు ఎంపీ బాలశౌరి అవగాహన లేకుండా అర్ధరహితమైన విమర్శలు చేయడం ఎంపీ బాలశౌరి అవివేకమన్నారు.ఇప్పటివరకు బాలశౌరిని మూడు సంవత్సరాల కాలంలో తాను ఎప్పుడూ విమర్శించలేదని, ఆయన చేసిన వ్యాఖ్యలపై ఈనాడు నేను మాట్లాడవలసిన అవసరం వచ్చింది అన్నారు.బందరు పై ఎంపీ బాలశౌరి కి ఏ మాత్రం అవగాహన లేదు అన్నారు.ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు, గోపు సత్యనారాయణ, తెలుగు రైతు మచిలీపట్నం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, వల్లూరి పల్లి గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, టీడిపి లీగల్ సెల్ నాయకులు, పుప్పాల ప్రసాద్, ఎండి సులేమాన్, మాదివాడ వెంకట నరసింహారావు, టీడిపి మచిలీపట్నం పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి, బత్తిన దాసు, టీడిపి మచిలీపట్నం పార్లమెంట్ ప్రచార కార్యదర్శి, పి.వి. ఫణి కుమార్, టీడిపి మచిలీపట్నం పార్లమెంట్ నాయకుడు, లంకేశేష గిరి, ఎల్ హరికృష్ణ, వై. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు:తంగిరాల సౌమ్య



నందిగామ జూన్ 12 ప్రజా పాలన ప్రతినిధి: నియో జకవర్గంలో ఆచరణలో సాధ్యం కాని హామీలను ప్రజ ల ముందల గుప్పిస్తూ ప్రజలను నానా విధాలుగా ఇబ్బంది పెడుతున్నారని మాజీ శాసన సభ్యురాలు తం గిరాల సౌమ్య తన కార్యాలయంలో ఒక పత్రికా ప్రక టన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూబాబు జగజ్జీవన్ రామ్ భవనాన్ని మైనారిటీ లతో పాటు అన్ని వర్గాల వారికి అందుబాటులోకి తీ సుకొనిరావాలన్నారునూతన షాదిఖానా నిర్మిస్తా మ ని చెప్పి మూడేళ్లు కావచ్చిన షాదీఖానా ఊసే లేద న్నారువైయస్ఆర్సీపీ ఎన్నికల హామీలలో భాగంగా షాదీఖానా ను ఏర్పాటు చేస్తామని చెప్పారుమూడు సంవత్సరాల కాలం గడిచినా కూడా దాని గురించి ఎందుకు పట్టించుకోలేదన్నారుప్రతి వర్గానికి కమ్యూ నిటీ హాల్ ఇస్తామన్నారు ఏ ఒక్కటి ఇప్పటివరకు చే యలేదన్నారు

## స్విమ్మింగ్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేసిన మాజీఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట జూన్ 12 ప్రజా పాలన ప్రతినిధి:ఇటీవ లబెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 5 స్వర్ణం, 14 రజిత, 9 కాంశ్య పతకాలు (మొత్తం 28) సాధించిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట స్విమ్మర్లను తెలుగు దేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తా తయ్య ) అభినందనందిస్తూ ఘనంగా సన్మానించా రు. అలాగే ఈ నెల 5వ తేదీన కే. అగ్రహారం లో ని ర్వహించిన జగ్గయ్యపేట, ఖమ్మం, మధిర, వైరా ఫ్రెం డ్లీ జూనియర్, సబ్-జూనియర్, మహిళా ఈతల పోటిల్లో 36 పతకాలు సాధించిన స్విమ్మర్లకు పత కాలు, సర్టిఫికెట్స్ బహుకరించారు. విజేతలు, కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి దంపతులు, రా యపూడి నిహారిక, షేక్ సలీమ్, తుమ్మడపు నాగ మ ణి, పరిణం రమాదేవి, యంగ్రాతి రామారావు, తుమ్మ డపు తిరుపతిరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ స్విమ్మర్స్ మరింతగా విస్తరించి బాలలందరికీ కూడా ఇక్కడ ఉ చిత శిక్షణ ఇవ్వడం అనేది కూడా ప్రశంసనీయు మని అభినందించారుఈ కార్యక్రమంలో డ్రీమర్స్, కృష్ణ స్విమ్మర్స్ ప్రతినిధులు స్విమ్మర్స్ కో-కన్వీనర్ య ల దండి శ్రీనివాసరావు, కోచ్ లు పొట్టాబత్తిన పాండు రంగారావు లక్ష్మి , పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి,లోక కళ్యాణార్థం, మహాన్యాస రుద్రాభిషేకం



చీరాల, జూన్ 12, ప్రజాపాలన : చీరాల కొట్లబజార్ నందలి, శ్రీ సత్యసాయి మందిరంలో, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకం, ఆదివారం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు.శ్రీ సత్యసాయి సేవా సంస్థలు - ఆంధ్రప్రదేశ్ వారి నిర్వహణలో, వేద విభాగం, రాష్ట్ర సమన్వయ కర్త, డాక్టర్.కొౌరు సాయి శ్రీహరి ప్రసాద్ శర్మ వారి ఆధ్వర్యంలో, వేద మంత్రోచ్చారణల నడుమ, అత్యంత నిష్ఠ గా కనుల పండువగా రుద్రాభిషేకం జరిగింది. సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవాలలో భాగంగా, ప్రపంచ శాంతి మరియు లోక రక్షణార్థం ప్రత్యేకంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించినట్లు, నిర్వాహకులు తెలిపారు. కనులారా స్వామివారి రుద్రాభిషే కం వేడుకలు, తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు అయ్యారు.కార్యక్రమంలో సత్య సాయి భక్తులు, శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్ ముంగర రాంబాబు, ట్రస్టు అధ్యక్షులు పొగడదండ రవికుమార్ ,చుండూరి సురేంద్ర ,సుబ్బయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాలి: మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.శుభవాణి



చీరాల, జూన్ 12, ప్రజాపాలన : "వరల్డ్ డే ఎగైనెస్ట్ చైల్డ్ లేబర్" సందర్భంగా,మండల న్యాయసేవాధికార సంస్థ, చీరాల వారి ఆధ్వర్యం లో స్థానిక బుర్లవారిపాలెం పంచాయితీ పరిధిలోని, సాయికాలనీ నందలి, షిరిడిసాయిబాబా మందిరం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శుభవాణి హాజరై మాట్లాడుతూ,బాలల్ని పనుల్లో పెట్టుకోవటం చట్టరీత్యా నేరమని,తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలకు పంపి చక్కగా చదివించాలని, తద్వారా చక్కటి భావి భారత పౌరులుగా తయారవుతారని ఉద్ఘాటించారు.లోక్ అదాలత్ ద్వారా, చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.వాసుబాబు, ప్యానెల్ అడ్వకేట్ రామకృష్ణ, పిఎల్వి.ఎస్ డి.మతీన్, బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీ వెంకట సుబ్బారావు,వివో ఏ ధనలక్ష్మి , గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు:డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట.జూన్ 12.(ప్రజాపాలన ప్రతినిధి) :బినరసరావుపేట పట్టణంలో స్థానిక 34 వార్డ్ బీసీ కాలని నందు తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముంతాజ్ మృతి చెందారు.వారి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ తెలుగుదేశం పార్టీ ఎల్ల వేళలా అండగా ఉంటుందని,చంద్రన్న స్ఫూర్తితో అరవిందబాబు ఆర్థిక సాయం అందచేశారు.ఆయన వెంట పొత్తూరి శ్రీను,నంబురి వెంకట్ రావు,మతంగి బంగారం వార్డ్ టీడీపీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# నిరుపేదల ఆకలి తీర్చండి

**టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చదలవాడ**



పల్నాడు జిల్లా.నరసరావుపేట.జూన్ 12.(ప్రజాపాలన ప్రతినిధి): వైయస్సార్ ప్రభుత్వం వచ్చే మూడు సంవత్సరాలు పూర్తయిన అన్నా క్యాంటీన్ ను ప్రారంభించక పోవటం దురదృష్టకరమని, జగన్ పేరో రాజశేఖర్ రెడ్డి పేరో ఏ పేరు పెడతారు పెట్టి నిరుపేదల ఆకలి తీర్చమని నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఘాటుగా విమర్శించారు. ఆదివారం నరసరావుపేటలో టీడీపీ నాయకుల వినూత్న నిరసన ప్రదర్శన చేశారు.తోపుడు బండిలో సమోసాలు పేదలకు పంచుతూ వినూత్న నిరసన . నరసరావుపేట టీడీపీ కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ.అన్న క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలని టీడీపీ నాయకులు డిమాండ్. నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో నిరసన.స్వయంగా తోపుడు బండిని నెట్టుకుంటు వెళ్తూ ప్రజలకు అల్పాహారం అందిస్తు ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ ఆవశ్యకతను ప్రజలకు తెలియచేస్తూ వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గా డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ తూ గత ఐదు సంవత్సరాలుగా చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి ఐదు రూపాయలకు భోజనం ఏర్పాటు చేసి ఎంతోమంది ఆకలి తీర్చిన ఘనత చంద్రబాబునాయుడు కు దక్కుతుందని అన్నారు. నిరుపేదలైన ప్రజలు ఉదయం ఐదు రూపాయలకి టిఫిన్, మధ్యాహ్నం 5 రూపాయలకు భోజనం , సాయంత్రం ఐదు రూపాయలకు భోజనం కేవలం 15 రూపాయలకే తృప్తిగా భోజనం చేసి ఆకలి తీర్చుకుంటున్నారని ఇప్పుడు వైయస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నా క్యాంటీన్ మూసివేశారని నిరుపేదలకు ఆకలి తీర్చడంలో వైసిపి ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్న క్యాంటీన్ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలు అన్న క్యాంటీన్ విషయంలో చర్యలు తీసుకొని నిరుపేదల ఆకలి తీర్చాలని చదలవాడ కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



భీమవరం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రతి కుటుంబానికి ప్రభుత్వంనుండి మేలుజరిగే విధంగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలో నూతనంగా ఎంపికైన 30 మంది వలంటీర్లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందని అన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు వాలంటరీ వ్యవస్థను అమలుచేసే దిశగా చర్యలు తీసుకున్నాయని అన్నారు. వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించి తద్వారా ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు వలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎస్. శివరామకృష్ణ, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎం సి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, కోడే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మారెడ్డి రవి కుమార్ పెద్దకర్మ కార్యక్రమంలో వేగేశన నరేంద్రవర్మ



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి: కొండుబోట్లవారిపాలెం గ్రామంకు చెందిన ఉమ్మారెడ్డి రవి కుమార్ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొనిఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులార్పించిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ వేగేశన నరేంద్రవర్మ మరియు కొండుబోట్లవారిపాలెం గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకు ఉమ్మ రెడ్డివెంకటేష్ , పల్లం జీవను, పల్లం సరోజిని, కార్యకర్తలుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు ఫూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో ఫూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

సంపాదకీయం


సోమవారం 13, జూన్ 2022

## ఇంకానా బాల కార్మిక వ్యవస్థ?

బాలలు భగవంతుడి స్వరూపాలంటారు. ఏ దేశానికైనా మూల స్తంభాలూ, భవిష్యత్తూ వాళ్లే. అమ్మ ఒడిలో, నాన్న లాలనలో, స్వేచ్ఛగా ప్రేమాభిమానాల మధ్య ఎదగడం బాలల హక్కు కావాలి. అమాయ కత్వంతో తొణికిసలాడే ఆ పసి మనసుల గురించి పట్టించుకోక పోవడం, అనాదరించడం సాంఘిక దురాచారమే అవుతుంది. ఈ 21వ శతాబ్దంలోనూ బాల కార్మిక వ్యవస్థ అతిపెద్ద ప్రపంచ సమస్యల్లో ఒకటి కావడం దురదృష్టకరం. ప్రపంచవ్యాప్తంగా కూడా బాలకార్మిక వ్యవస్థ కొన సాగేందుకు బోలెడన్ని కారణాలు ఉన్నాయి. పేదరికం, నిరక్ష రాస్యత, పెద్ద పెద్ద కుటుంబాలు, బాలలకు సులువుగా ఉపాధి దొరికే అవకాశం లేకపోవడం, ఉన్న చట్టాల అమల్లో నిర్లక్ష్యంతో పాటు అనేక ఇతర అంశాలు కూడా చేరడం వల్ల ఈ సాంఘిక ఆర్థిక, రాజకీయాలు కలిసి ఈ దురాగతం ఇంకా కొనసాగేలా చేస్తున్నాయి. అయితే బాల కార్మిక వ్యవస్థను ఒక ఆర్థిక సమస్యగా పరిగణిస్తే మాత్రం ఏ దేశమూ దీన్ని పరిష్కరింప జాలదు. సామాజిక దృక్పథంలో మార్పు రావాలి. రాజకీయం గానూ కొంత సున్నితంగా వ్యవహరించాలి. గత ఎనిమిదేళ్లలో బాల కార్మిక వ్యవస్థను నియంత్రిం చడంలో దేశం చెప్పుకోదగ్గ స్థాయిలో విజయవంతమైంది. నేను కేంద్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి (స్వతంత్ర ప్రతిపత్తి)గా వ్యవహరిస్తున్న సమయంలో అమల్లోకి వచ్చిన 'ద చైల్డ్ లేబర్ (ప్రొహిబిషన్ అండ్ రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ యాక్ట్ 2016' పాత్ర కూడా ఇందులో ఉండటం ముదావహం. పద్నాలుగేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలను ఏ రకంగానూ పనిలో పెట్టుకోకూడదని ఈ చట్టం చెబుతుంది. అలాగే 14-18 మధ్య వయస్కులను ప్రమాదకరమైన వృత్తుల్లో నియమించ రాదు. అయితే కుటుంబ సభ్యుల లేదా కుటుంబ వ్యాపారంలో బాలలు సాయం అందించేందుకు ఈ చట్టం అవకాశం కల్పి స్తోంది. అలాగని ప్రమాదకరమైన వృత్తులో పని చేసే అవకాశం లేదు. మా అమ్మ ఈశ్వరమ్మ ఉల్లిపాయలు అమ్మేది. స్కూల్ అయిపోయిన తరువాత నేనూ దుకాణంలో అమ్మకు సాయపడే వాడిని. అయితే 2016 నాటి చట్టం కంటే ముందు ఇలా చేయడం శిక్షార్హమైన నేరం. నా చిన్నతనపు కథనం ఎందుకు ప్రస్తావిస్తున్నానని అనుకుంటున్నారా? ఎందుకంటే ప్రమాద కరం కాని చాలా వాణిజ్య కార్యకలాపాల్లో ఇప్పటికీ తల్లిదండ్రు లకు పిల్లల సాయం అవసరమవుతూంటుంది. అటువంటి సందర్భాల్లో పిల్లలు వారికి సాయపడటంలో తప్పులేదు. ఇంకో విషయం: మా అమ్మ ఎప్పుడూ స్కూల్ ఎగ్గొట్టి తనకు సాయపడాలని కోరలేదు. ఆ విషయం నేనెప్పుడూ గుర్తుంచు కుంటాను. కష్టాలెన్ని ఉన్నా నాకు మంచి విద్యను అందించా లన్న ఆమె దృఢ నిర్ణయానికి నమస్సులు అర్పిస్తాను. బాలాకార్మికులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా కేంద్రీ కృతమై ఉన్న నేపథ్యంలో వారందరిలోనూ వీలైనంత తొందరగా చైతన్యం కల్పించాల్సిన అవసరముంది. నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు కింద ఇప్పటివరకూ దాదాపు 14 లక్షల మంది బాలకార్మికులకు విముక్తి లభించింది. అంతేకాకుండా ప్రత్యేక శిక్షణా కేంద్రాల ద్వారా వారికి బ్రిడ్జ్ కోర్సులు అందించి సాధారణ పాఠశాలల్లో విద్యనభ్యసించే అవకాశం కల్పించారు. వృత్తి నైపుణ్యాలు అందించడంతోపాటు మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య సేవలు, ఉపకార వేతనం కూడా అందించారు. బాలకార్మిక వ్యవస్థ నుంచి బయటపడ్డ వారు సొంతంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వీలుగా సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2021 మార్చి 31 నాటికి దేశంలోని 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 1,225 ప్రత్యేక శిక్షణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. తల్లిదండ్రుల వృత్తుల్లో బాలలు కార్మికులుగా చేరడం మనం చాలాకాలంగా చూస్తున్నాం. ఇటుక బట్టీలు, గార్మెంట్స్, వ్యవసాయం, టపాసుల తయారీల్లో బాలకార్మికుల భాగ స్వామ్యం ఉంది. ధాబాలు, చిన్న చిన్న హొటళ్లు, టీస్టాల్స్, తివాచీ, చేతిగాజుల పరిశ్రమల్లో పిల్లలు రకరకాల పనులు చేస్తున్నారు. ఇలా అసంఘటిత రంగాల్లో బాలకార్మికులు పనిచేసే అవకాశాలు ఎక్కువ. అయినప్పటికీ పాఠశాలలకు పంపకుండా పనిలో పెట్టుకుంటున్న కుటుంబ సభ్యులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇది మరింత సమర్థంగా, వేగంగా జరగాలి.రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్‌ను సక్రమంగా అమలు చేయడం కూడా బాలకార్మిక వ్యవస్థ పీడ వదిలించుకోవడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. సమగ్ర శిక్ష అభియాన్ సమన్వయంతో ఐదు నుంచి ఎనిమిదేళ్ల మధ్య వయస్కులు విద్యా వ్యవస్థలో భాగమయ్యేలా చూడాలి. అలాగే 'పెన్సిల్' (ప్లాట్‌ఫార్మ్ ఫర్ ఎఫెక్టివ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫర్ నో చైల్డ్ లేబర్)పై సమర్థమైన నిఘా ఉంచాలి. కుటుంబాల వృత్తుల్లో పాల్గొన్న వారిని కూడా బాలకార్మికులుగా గుర్తించడం ద్వారా ప్రస్తుత పరిస్థితి మార్చలేము. అందుకే భిన్నమైన ఆలోచనతో ఈ చిక్కుముడిని విప్పాల్సి ఉంటుంది. పైగా ఈ పని కేవలం ప్రభుత్వానిది మాత్రమే అనుకుంటే తప్పు. ఎన్జీవోలు, స్వచ్ఛంద కార్యకర్తలు, సీనియర్ సిటిజెన్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. 2022 సంవత్సరపు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాలను 'సార్వత్రిక సామాజిక పరిరక్షణ ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన' అన్న అంశం ప్రధాన ఇతివృత్తంగా నిర్వహిస్తూండటం ఎంతైనా సంతోషకరం. బాల కార్మికుల్లేని ప్రపంచం ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒకటన్న సంగతి ఇక్కడ ప్రస్తావించుకోవాలి. 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను తుదముట్టించాలన్న లక్ష్యం ప్రపంచం ముందున్న విషయం తెలిసిందే. ఈ దిశగా భారత్ గత ఎనిమిదేళ్లల్లో ఎంతో ప్రగతి సాధించింది. కోవిడ్-19 కారణంగా ఇబ్బందులు ఎదురైనా బాలకార్మిక వ్యవస్థ మళ్లీ వేళ్లూనుకోకుండా దృఢ సంకల్పం, నిశ్చయంతో పని చేయా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. కలిసికట్టుగా కృషి చేస్తే దేశం త్వరలోనే బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొందగలదు!

## అంగీకారం లేని చర్యలన్నీ దాడులే





జూబిలీహిల్స్‌లో మైనర్ యువతిపై జరిపిన సామూహిక అత్యాచారంలో రాజకీయ పరపతి ఉన్న కుటుంబాల యువకులు ఉండటంతో పోలీసులు కేసు నమోదులో తాత్సారం చేయటం రాష్ట్రంలో అమలవుతున్న సమన్యాయం గురించి సహజంగానే అనేక ప్రశ్నలు లేవదీసింది. పేద వర్గాల, కింది కులాల యువకుల ప్రమేయం ఉన్నప్పుడు అత్యుత్సాహంతో నియమ నిబంధనలు అతిక్రమించి వ్యవహరించే వ్యవస్థ డబ్బు, పరపతి, రాజకీయ అధికారం ఉన్న యువకుల దగ్గరికొచ్చేటప్పటికి అన్ని రకాల నియమాలు వల్లించటమేమిటి? బాలికలు, స్త్రీలపై జరిగే హింస పట్ల రాష్ట్ర అధికార వ్యవస్థకు ఉన్న నిబద్ధత గురించి కూడా ఇది అనుమానాలు రేకెత్తించింది. అయితే, జరుగుతున్న వాటన్నింటి మధ్య ఆందోళన కలిగించే విషయం 'ఆ యువతి ఇష్టపూర్వకంగానే, తన అంగీకారంతోనే కారు ఎక్కింది కదా' అని ప్రజల మధ్య పాకుతున్న వాదన.అత్యాచార ఘటనల్లో అంగీకారం (కన్సెన్ట్) గురించిన చర్చ ఈ రోజుది కాదు. స్త్రీలు, యువతులు రెచ్చగొడితే తప్ప మగవాళ్ళు తమంతట తాము వారి మీద పడరనీ, స్త్రీల అంగీకారం లేకుంటే లైంగిక చర్య అసాధ్యమనీ వాదించే వారి సంఖ్య తక్కువేమీ కాదు. స్త్రీలు, యువతులు తమ పైన జరిగిందని చెప్పే అత్యాచారాలు సాధారణంగా వారి అంగీకారంతో జరిగే ఉంటాయనీ, కేవలం తమ స్వలాభం కోసమే జరిగిన దాని గురించి అబద్ధాలు చెప్తారనే బలమైన నమ్మకం పోలీసుల్లో, కోర్టుల్లోనే కాక, ప్రజా సంస్కృతిలో కూడా అది విస్తారంగా ఉంది. ఒక మహిళ వంటి మీద గాయాలు లేకున్నా, ఆ పురుషుడి వంటి మీద గాయాలు చెయ్యకపోయినా ఆ మహిళ లైంగిక చర్యకి అంగీకరించింది అని అర్థం చేసుకోవాలనే నియమం ఒకటి శిక్షా స్మృతిలో ఉంది. మహిళా ఉద్యమ పోరాట ఫలితంగా 1984లో ఆ నియమాన్ని మార్చారు. దీని ఫలితంగానే అప్పుడు అధికారపూరిత సంబంధాల్లో జరిగే సంఘటనలకు, పురుషులు గుంపుగా చేసే సంఘటనల్లోనూ బాలికలు అంగీకారం ఇచ్చినట్లు ఏ మాత్రం భావించకూడదని చట్టం గుర్తించటం మొదలు పెట్టింది. అయితే లైంగిక సంబంధాలు, చర్యల్లో అంగీకారం గురించి ప్రజా రంగంలో జరుగుతున్న చర్చ తీరుతెన్నులు భిన్నంగా ఉన్నాయి. ఆ చర్చ ఇప్పటికీ 'సమాజం ఎంత మారినా, స్త్రీ పురుషులు ఎన్ని చోట్ల కలిసి పని చేసినా, ఎన్ని స్నేహాలు పెంచుకున్నా, మగవాళ్ళు సహజంగానే ఏ స్త్రీనైనా లైంగిక దృష్టితోనే చూస్తారని, అవకాశమొస్తే వారిని వాడుకోవాలని చూస్తారని, దానికి బలం వాడటానికి వెనుకాడరని, కాబట్టి బాలికలు, స్త్రీలు వారితో ఎప్పుడూ, ఎన్నటికీ జాగ్రత్తగా, హద్దుల్లో మాత్రమే వ్యవహరించాలనే' దృష్టితోనే నడుస్తోంది. ఇది అనాగరిక దృక్పథం. ఈ అనాగరిక దృక్పథాన్ని చాలా మంది 'వాస్తవిక దృక్కోణం' అని కూడా నమ్మబలుకుతుంటారు.ప్రవృత్తి పరంగా స్త్రీ పురుషులు ఎప్పటికీ మారరనే అశాస్త్రీయ ధోరణితో నడిచే ఈ చర్చ గత వందేళ్లలో మన దేశంలోనే జరిగిన మార్పుల గురించి గుర్తించటానికి సిద్ధంగా లేదు. స్త్రీలని ఎప్పటికప్పుడు హద్దులు దాటమని వందేళ్ల క్రితం నాటి సామాజిక ఉద్యమాల దగ్గరినుండి నేటి ప్రభుత్వాలు రోజు వారీ చేసే స్త్రీల సాధికారత ప్రకటనల వరకూ ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. మీకు హద్దులు లేవు, సైన్యంలోకి రావచ్చు, పోలీసులు కావచ్చు, రోదసిలోకి వెళ్లొచ్చు, యూనివర్సిటీలకి వీసీలు కావచ్చు, కలెక్టర్లు కావచ్చు అని చెప్పుకుంటూ వస్తున్నాయి. బాలికలు, బాలురు అలాగే యువతులు, యువకులు చదువులు, ఆటల్లో పోటీ పడుతున్నారు. ఇంకా అనేక రకాల పోటీల్లో పాల్గొంటున్నారు. వీటన్నిటినీ చూస్తే ఈ స్త్రీ -పురుష ప్రవృత్తి సిద్ధాంతం తప్పని ఎవరికయినా అర్థమవుతుంది. ఇన్ని విషయాల్లో మారుతున్న బాలికలు, బాలురు, యువతీ యువకులు రొమాంటిక్ సంబంధాల విషయంలో మాత్రం మారకుండా ఎలా వుంటారు?ఇలా మారుతున్న పరిస్థితులని, మహిళా ఉద్యమకారుల కృషి ఫలితంగా 2013లో జరిగిన చట్టమార్పులు గుర్తించాయి. యువతీ యువకుల/ స్త్రీ - పురుషుల సంబంధాల్లో అంగీకారానికి అవి కొత్త నిర్వచనాలు ఇచ్చాయి. మారుతున్న పరిస్థితుల్లో పాత హద్దులు చెరిగి, కొత్త హద్దులు ఏర్పడాల్సిన అవసరాన్ని గుర్తించాయి. యువతీ యువకులు దగ్గరగా మెలిగే పరిస్థితుల్లో ప్రతి చర్యకి అంగీకారం అవసరం అనే కొత్త హద్దు ఈ సందర్భంగానే ఏర్పరిచారు. మార్పుని ఆహ్వానిస్తూనే, శారీరక సంబంధాల పరిణామం, ఇష్టపూర్వకమయినా, బలవంతంగా జరిగేవయినా, ఇప్పటికీ స్త్రీలపైనే తీవ్రంగా వుంటాయనే సామాజిక వాస్తవికతని గుర్తించిన చట్ట మార్పులివి. 2012లో ఢిల్లీలో జరిగిన సామూహిక అత్యాచార సంఘటనతో చట్టంలో మార్పులొస్తే, 2017లో మీ టూ ఉద్యమ సందర్భంలో అనేక మంది స్త్రీలు అంగీకారంపై చర్చని ముందుకు తీసుకెళ్లారు. విషయం సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలా, కాదా అని కాక, సన్నిహిత సంబంధాల్లో కూడా అంగీకారం లేని చర్యలన్నీ దాడులనే భావనని సమాజంలోకి తెచ్చింది. మొదట ఇష్టంతో కొన్నింటికి ఒప్పుకున్నంత మాత్రాన, తర్వాత మగవాళ్ళు చేయాలనుకునే, చేసే అన్ని లైంగిక చర్యలకి వాళ్ళు అంగీకారాన్ని తెలిపినట్లు కాదని అర్థం చేయించటానికి ప్రయత్నించింది.నడుస్తున్న ఈ చరిత్ర నేపథ్యంలో, ఇప్పటి సంఘటనని చూద్దాం. జూబిలీహిల్స్ మైనర్ అమ్మాయి ఇష్టంతోనే పబ్‌కి వెళ్లిఉండొచ్చు. తర్వాత తనకి తెలిసిన అబ్బాయే కాబట్టి ఆ అబ్బాయితో కారులో ఇంటి వరకూ ప్రయాణం చెయ్యటానికి సిద్ధపడి ఉండొచ్చు. దీన్ని కూడా అడ్వెంచర్ అందామా మనం? అబ్బాయి మంచివాడని నమ్మింది కాబట్టే అమ్మాయి కారెక్కింది. మరి అతడేం చేసాడు? పచ్చి నమ్మకద్రోహం. మగ స్నేహితులతో కలిసి ఆమెని సామూహిక లైంగిక దాడికి గురిచేశాడు. దానికి ఏ అమ్మాయి అయినా అంగీకారం తెలుపుతుందా? చర్చ జరగాల్సింది నమ్మిన స్నేహితురాలికి ద్రోహం చేసే అబ్బాయిల గురించి కదా? అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి చదువుకుంటూ, పబ్‌లకి వెళ్తూ, సెలెబ్రేట్ చేసుకోవటం మామూలవుతున్న ఈ సందర్భంలో ఎందుకు అబ్బాయిలు నమ్మిన స్నేహితురాళ్ళకి ఇటువంటి ద్రోహం చేస్తున్నారు అనేది చర్చలోకి రాకుండా, అమ్మాయిలు హద్దుల్లో ఉండాలి అన్న చర్చ ఎందుకు నడుస్తున్నట్లు?'మా కాలంలో అయితే మేమెప్పుడూ హద్దులు మీరి ప్రవర్తించే వాళ్ళం కాదు, ఎప్పుడూ దూరంగానే ఉండేవాళ్ళం' అనే ఆడవాళు, మగవాళ్ళు కోకొల్లలు. వీరు సైతం గుర్తించాల్సిన విషయం మారుతున్న పరిస్థితులు సన్నిహితంగా మెలిగే సందర్భాలని ఏర్పరిచి, కొత్త రకమయిన హద్దుల్ని నేర్చుకోవాల్సిన అవసరాన్ని, దానికోసం అమ్మాయిలు, అబ్బాయిలుకూడా మారాల్సిన సందర్భం కల్పించాయని. ఈ హద్దులు పాత సమాజ విలువలను అనుసరించి కేవలం అమ్మాయిలకే కాదు, అబ్బాయిలకి కూడా అని అర్థం చేసుకున్న యువకులు, ఇప్పటికే తయారవుతున్నారని. ఎంత సన్నిహితంగా మెలిగినప్పటికీ, అమ్మాయిల ఇష్టాయిష్టాలని అర్థం చేసుకోవటం, నీకు ఇది చెయ్యటం ఇష్టమేనా అని అడగటం పెద్ద కష్టమయిన విషయమేమీ కాదు కదా? అలా మారని అబ్బాయిలకి ఈ విషయం నేర్పాల్సిన సందర్భం వచ్చినప్పుడు చర్చ యువతుల, స్త్రీల 'హద్దు మీరిన' ప్రవర్తన చుట్టూనే ఇంకా తిరగటం బాధ్యతారాహిత్యాన్ని సూచించదూ? బాలికలు, యువతులు, స్త్రీలు రెండు శతాబ్దాలుగా సమాజం కల్పించిన సమానత్వ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని కొంత మేర అనుభవిస్తూ వాటి సరిహద్దులని తమ కోసం, మిగిలిన వారి కోసం విస్తరించటానికి ప్రయత్నిస్తూ వస్తున్నారు. సమస్య వారితో కాదు, వారిపైన దాడులు జరిపిన, జరుపుతున్న వాళ్ళతో. విషయం, అప్పుడూ, ఇప్పుడూ అంగీకారం గురించే. 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' అన్న విలువలు స్త్రీలకి తమ ఇష్టాయిష్టాల గురించి కనీసం చెప్పుకోలేని సమాజ పరిస్థితుల్లో చెలామణి అయ్యేవి. మనం ఇప్పుడు మాట్లాడుకోవాల్సింది, ఆ పరిస్థితులు మారుతున్న సందర్భంలో, సన్నిహిత సంబంధాల్లో అంగీకారాన్ని అర్థం చేసుకోవటం గురించి, శారీరక సాన్నిహిత్యం మొదలయిన తరువాత కూడా వద్దు అంటే ఒప్పుకుని పక్కకి జరగటం గురించి. ఎంత కష్టమయినా, సంక్లిష్టమయినా, ఆ చర్చని ఇప్పటికయినా ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

## ఆ నామవాచకం ఓ చైతన్య జ్వలనం!

ఓ జ్ఞానజ్యోతీ, భారత రాజ్యాంగ నిర్మాతా, ప్రపంచ మేధావీ అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును కోనసీమకు పెట్టడంలో ఒక చారిత్రక నేపథ్యం ఉంది. అంబేడ్కర్ స్వయంగా తూర్పుగోదావరి ప్రాంతమంతా పర్యటించారు. ఈ ప్రాంతమంతా చారిత్రకంగా బౌద్ధ భూమి. ఇక్కడ వేల సంవత్సరాలు బౌద్ధం విరాజిల్లింది. అందుకే ఇక్కడ సామాజిక సామరస్యం ఎక్కువ. సర్ ఆర్థర్ కాటన్ మహోన్నతమైన కృషి వల్ల ఇక్కడ వ్యవసాయ విస్తరణ జరిగింది. ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, బ్యారేజీల నిర్మాణంలోనూ, నీటిపారుదల కాల్వల నిర్మాణంలోనూ ప్రజలందరూ కులమత భేదాలు లేకుండా భాగస్వాములయ్యారు. ఇక్కడ భాష కూడా అందరూ ఒకే రకంగా కుల మతాలకు అతీతంగా మాట్లాడతారు. ఊనికలు ఒకే రకంగా ఉంటాయి. ఇక్కడ కులాలు రూపొందాయి కానీ కులాలు లేవు. అంబేడ్కర్ స్ఫూర్తితో ఇక్కడ విద్య వికసించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరులో వ్యక్తిత్వ నిర్మాణం ఉంది. విద్యా వికాసం ఉంది. ప్రపంచ జ్ఞానం ఉంది. ముఖ్యంగా ఆత్మగౌరవం ఉంది. బౌద్ధ సంస్కృతీ వికాసం ఉంది. సామాజిక సమతుల్యత ఉంది. ఆర్థిక సముత్తేజం ఉంది. కుల నిర్మూలన ఉంది. అంబేడ్కర్ పేరు వలన కోనసీమకే కీర్తి వస్తుంది. అంబేడ్కర్‌ది అంతర్జాతీయ నామవాచకం. అందుకే కోనసీమకు అంబేడ్కర్ పేరు ఉచితమై నది. ఆ పేరును భారతదేశంలో ఎక్కువ విశ్వవిద్యాలయాలకు పెట్టారు. భారత దేశంలో ఉన్న ఏడు లక్షల గ్రామాల్లో ఎక్కువ గ్రామాలకు పెట్టిన పేరు అంబేడ్కర్. ఆయన నామవాచకంలో విద్యా, సాంస్కృతిక వికాసం ఉంది. అంబేడ్కర్ కుల నామవాచకం కాదు. కుల నిర్మూ లనా ప్రతీక! అది మతాలకు, కులాలకు సంబంధం లేని జాతీయ స్ఫూర్తిని కలిగిస్తుంది.అంబేడ్కర్ విగ్రహాన్ని లండన్‌లోని 'ఇండియన్ హౌస్'లో రూపొందించుకున్నారు. నేను స్వయంగా వీక్షించాను. ఆ విగ్రహ సమక్షంలో నా రచన 'కాస్ట్ అండ్ ఆల్టర్నేటివ్ కల్చర్' పుస్తకాన్ని వీపీ సింగ్ ఆవిష్కరించారు. లండన్ మ్యూజియం లైబ్రరీలో అంబేడ్కర్ చిత్ర పటం ఉంది. అదీ నేను స్వయంగా వీక్షించాను. లండన్ 'హౌస్ ఆఫ్ కామన్స్'లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శత జయంతి చేశారు. దానికి నేను హాజరయ్యాను. అంబేడ్కర్ నామవాచకం బుద్ధుని తర్వాత, అశోకుని తర్వాత భారతదేశ ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచింది. నిజానికి కోనసీమ ప్రేమసీమ! ఇక్కడ అంబేడ్కర్ పేరు పెట్టినందుకు వచ్చిన ఆవేశం నీటి తుంపరల నుండి వచ్చిన అగ్నిచ్ఛట లాంటిది. కొన్నిసార్లు ఆవేశం అనర్థానికి దారి తీస్తుంది. ప్రతి ఆవేశం వెనుక కొన్ని రాజకీయ



కారణాలుంటాయి. ఈ రాజకీయ కారణాలకు అతీతమైన వాడు అంబేడ్కర్. భారతదేశాన్ని కులరహిత సమాజంగా తీర్చిదిద్దాలనుకున్నవారు. సమాజ పరిణామంలో కులం ఇటీవల వచ్చింది. మళ్లీ అది పోతుంది. కుల భావనకు విరుగుడు జ్ఞానార్జనే అని అంబేడ్కర్ చెప్పారు. మను షులకు మనుషులు పుడతారనేది జ్ఞానం. కులాలకు మనుషులు పుట్టరనేదే తత్త్వం. మామూలు మనుషులు, ప్రతిభ లేని మనుషులు కులం పేరు చెప్పుకుని బతకాలని చూస్తారు. కులానికి అతీతమైన నామవాచకాలు ఇప్పుడు దేశానికి అవసరం. అంబేడ్కర్‌ను మహాత్మా గాంధీ 'డాక్టర్' అని పిలిచారు. ఆనాటి ప్రజా సమూహాలు అంబేడ్కర్‌ను 'బాబా సాహెబ్' అని పిలిచాయి. అంటే తండ్రి అని అర్థం. పెరియార్ రామస్వామి నాయకర్ అంబేడ్కర్‌ను 'బాబా సాహెబ్' అనే ప్రస్తావించారు. ఆయన భారతదేశానికి తండ్రి స్థాయికి బతికి ఉన్నప్పుడే ఎదిగారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అంబేడ్కర్ మరణించినప్పుడు 'భారత దేశ ధ్రువతార' రాలిపోయిందని అన్నారు. అంబేడ్కర్ ఐదు లక్షల మందితో 1956 అక్టోబర్‌లో పూనాలో జరిపిన బౌద్ధ దీక్షకు కోనసీమ నుండి ఆ రోజుల్లోనే ప్రతినిధులు విస్తృతంగా హాజరయ్యారు. ఆయన అందరి మెదళ్లలో దీపాలు వెలిగిస్తూ వెళ్ళారు. కానీ మీరు భవంతులు తగలబెడుతున్నారు. తగలబడిన ప్రతి భవంతీ కొత్తరూపం తీసుకుంటుంది. అంబేడ్కర్ భావజాలంతో మీలో మార్పు రావాలి. నీకు తిరగబడే చైతన్యాన్నిచ్చిన వాడు కూడా ఆయనే అని ముందు గుర్తించాలి. భేదాభిప్రాయాల్ని సదభిప్రాయంగా మార్చు కోవడమే అంబేడ్కరిజం.

# అన్నపూర్ణ ఏపీని... హత్యల ఆంధ్రప్రదేశ్‌గా చేస్తున్నారు

## తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, జూన్ 9, ప్రజాపాలన : రాష్ట్రంలో జగన్ రెడ్డి మూడేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలను, ప్రతిపక్ష నేతలను వందల మందిని వైసీపీ నేతలు క్రూరంగా హత్యలు చేసి, అన్నపూర్ణగా ఉన్నఆంధ్రప్రదేశ్‌ను హత్యఆంధ్రప్రదేశ్ మార్చారని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ,పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మూడేళ్ల వైకాపా పాలనలో అధికార పార్టీ నాయకుల అవినీతికి, దాష్టీకాలకు బలైన సామాన్యుల వివరాలతో 'ఫ్యాక్షనిస్ట్ పాలనలో క్రూరహత్యలు' పేరుతో పార్టీ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించి, విలే కర్లతో మాట్లాడారు. వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో సాక్షుల్ని, అనుమానితుల్ని ఇష్టానుసారం చంపేస్తుంటే సీబీఐ ఏం చేస్తోందన్నారు. 'జగన్‌పై అవినీతి కేసుల్లో సీబీఐ ఏం చేసింది? రూ.42 వేల కోట్ల అవినీతి జరిగిందని ఛార్జిషీట్ వేశాక కూడా ఎందుకు చర్యల్లేవు? ఒక నేరస్థుడు ముఖ్యమంత్రి అయితే ఎన్ని నేరాలు, ఘోరాలు చేసినా సీబీఐ పట్టించుకోదా' అని ఆయన ధ్వజమెత్తారు.వివేకా హత్య కేసులో సీబీఐ దగ్గర అప్రూవర్‌గా మారిన వ్యక్తిని చంపేస్తామని బెదిరిస్తే, అతను పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు.తప్పు చేసిన ప్రతి పోలీసు అధికారి లెక్కలూ తమ దగ్గరు న్నా యని, వారిపై విచారణ జరిపి శిక్షలు విధించేందుకు తెదేపా అధికారంలోకి రాగానే ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పార్టీ కార్యకర్తలపై పోలీసుల వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లాల్లో జరిగే మహా నాడుల్లోనూ, పార్టీ కేంద్రకార్యాలయంలో సెల్ ఏర్పాటు చేస్తామన్నారు.జగన్ రెడ్డి ముఠా లాండ్,శాండ్, వైన్, మైన్, డ్రగ్ మాఫియాల లూటీని ప్రశ్నించినందుకే ఘోరహత్యలు చేశారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు బాబాయిని గొడ్డలితో నరికి చంపారు. వైకాపా ఎమ్మెల్సీ అనంత బాబు తన డ్రైవర్ను చంపి డోర్ డెలివరీ చేశారు. మద్యం మాఫియాను ప్రశ్నించిన దళిత యువకుడు ఓం ప్రతాప్ చావుకు మంత్రి పెద్దిరెడ్డి కారకులయ్యారని అన్నారు. బీసీ నేత నందం సుబ్బయ్యను ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదొడ్డి హత్య చేయించాడు. బీసీ నేతలైన తోట చంద్రయ్య, జల్లయ్య యాదవన్ను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హత్య చేయించారు. అనంతపురంలో బీసీ విద్యార్థిని స్నేహ లతను హత్య చేశారు. తూర్పు గోదావరి జిల్లా తుని నియోజకవర్గానికి చెందిన సీనియర్‌జర్నలిస్ట్ కాతా సత్యనారాయణను దారుణంగా హత్య చేశారు. గాబు రాజు అనే వైసీపీ నాయకుడు తనపై హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. గురజాలలో పురంశెట్టి అంకులు అనే కాపు నేతను హత్య చేశారు.మాస్క్ అడిగినందుకు దళితడాక్టర్ సుధాకర్ను పిచ్చివాడిగా ముద్రవేసి ప్రాణాలు తీశారు. గురజాలలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దోమతోటి విక్రమ్ను కుర్రంగా హత్య చేశారు. రమావత్ మంత్రూబాయి అనే గిరిజన మహిళను వైసీపీ నేత శ్రీనివాస రెడ్డి ట్రాక్టర్ తొక్కించి హత్య చేసినా కేసు నమోదు చేయకుండా గిరిజనుల్ని అణచివేశారు.వైసీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఒక్క జంగారెడ్డిగూడెంలోనే నాటుసారా వల్ల 27 మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. వారి భార్యల మాంగల్యాలు మంటగలిశాయన్నారు. వేలాదిమంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజల ప్రాణాలు తీసి కొద్ది మందికి మంత్రి పదవులు కట్టబెట్టి ఏసీ బస్సుల్లో జల్సాగా తిప్పడం సామాజిక న్యాయమా? స్థానిక సంస్థల ఎన్నికల్లో 10శాతం రిజర్వేషన్ కోత కోసి 16,800 రాజ్యాంగబద్ధ పదవులను రద్దు చేయడం సామాజిక న్యాయమా? 10 వేల ఎకరాల అసైన్డ్ భూములను బీసీ, ఎస్సీ, ఎస్టీపల్నాడులో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. పోలీసులకు జీతాలు ఇస్తున్నది ప్రజలు.. జగన్ రెడ్డి కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కావేపలి హరిబాబు ,రామాంజనేయులు, మక్కెన శేఖర్ బాబు,పెంట్యాల శ్రీను,అడుసుమల్లి హర్ష తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



భీమవరం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఆదివారం భీమవరం చేరుకున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అంతరాలయంలోనికి తోడ్కొని వెళ్లారు. మంత్రి కిషన్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొని అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలకగా ఆలయ ఈవో అమ్మవారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.అనంతరం కేంద్ర మంత్రి తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని కార్యాలయ ఆవరణలో క్విట్ ఇండియా స్తూపాన్ని సందర్శించి పూలమాల వేశారు. అనంతరం ప్రకాశం చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జె.మురళి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీది అసమర్థ పరిపాలన



నరసాపురం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 18వ వార్డులో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొని వార్డులోని ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసమర్థ పరిపాలన చేస్తూ ప్రజలపై తీవ్ర ఆర్థికభారం మోపారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై అధిక ధరలు, పన్నుల పెంపు, కరెంటు బిల్లులు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఇసుక, మద్యం ధరల పెంపుతో సామాన్య ప్రజల ధన, ప్రాణాలను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, పదవ తరగతి విద్యార్థులపై ప్రభుత్వం అవలంబించిన స్వార్థపూరిత రాజకీయాలను ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పెంద్ర శ్రీనివాస్, సమతం వెంకటేశ్వరరావు, అలివేలుమంగ తాయారు, ముంగండ శివరంగ గణేష్, బొంతు నాగరాజు, బాసిన చంటి, కటకం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ కార్యక్రమాలు






గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్11: పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతోపాటు గా, పెద్ద సంఖ్యలో ప్రజానీకం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిఎస్పీ సత్యానందం మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ ,కొకెయిన్, మద్యం ఇలా పేర్లు వేరైనా మాదక ద్రవ్యాలు మత్తు పానీయాల వల్ల నిండు జీవితం సర్వ నాశనం అవుతుందనీ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విచక్షణ శక్తిని కోల్పోయి ఎందరో యువకులు అఘాయిత్యాలకు పాల్పడి తమ కుటుంబాలను వీధుల పాలు చేయడమే కాకుండా, తమ నిండు నూరేళ్ల జీవితాన్ని సర్వ నాశనం చేసుకుంటున్నారని డీఎస్పీ సత్యానందం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ దుర్గారావు, డివిజన్ పరిధిలోని పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లలు, మరియు నవజాత శిశువుల వైద్యంలో నూతన ఆవిష్కరణలు



రాజమండ్రి,ప్రజాపాలన ప్రతినిధి : నేడు వైద్యరంగంలో ఎన్నో విన్యూత్న మార్పులు సంభవిస్తున్నాయని వైద్య రంగంలో సరిక్రొత్త విప్లవాత్మకమైన మార్పులతో ఆధునిక వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి చేరువయ్యాయని ఆదివారం నాడు రాజమండ్రి ఆనంద్ రీజెన్సీ హొటల్ లో జరిగిన వైద్యుల సదస్సులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రాజమండ్రి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్, తూర్పు గోదావరి జిల్లా విభాగం ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టిసియన్ అండ్ గైనకాలజీ సొసైటీ మరియు అను మై బేబి హాస్పిటల్ సంయుక్తం గా నిర్వహించిన సదస్సులో పలువురు డాక్టర్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అను హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ డా. రమేష్ గాజుల ప్రసంగిస్తూ నేడు వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయని వాటి పరిజ్ఞానంతో అందరికీ ఆధునిక వైద్యం అందించడం సులువైందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నూతన వైద్య విధానంపై అనేక సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పిడియాట్రిక్ కార్డియాలజి, నియోనేటల్, గైనకాలజి, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్, గస్ట్రో ల లో ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నామని అవి ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డా. ఎస్. కిరణ్ కుమార్, డా. వి. విశ్వేశ్వరరావులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. ఆర్.ఎస్. చలం మరియు డా. సతీష్ యం. ఎస్ మరియు డా. ఆర్. రామకృష్ణ గారు మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో ఇటీవల జరుగుతున్న అప్డేట్స్ వివరించారు. గౌరవ అతిథులుగా డా. వై.ఎస్. గురుప్రసాద్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు రాజమండ్రి ఇండియన్ అకాడమీ పిడియాట్రిక్స్ తూర్పు గోదావరి జిల్లా విభాగపు అధ్యక్షులు డా. ఆకుల. సత్యనారాయణ, ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టిస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ అధ్యక్షురాలు డా. టి.పద్మజ గారు గైనకాలజి, నూతన శిశువుల వైద్యంలో ఆధునిక వైద్య సేవల గురించి వివరించారు. సైంటిఫిక్ కమిటీ సభ్యులుగా డా. కె.వి. రవికుమార్, డా. గురుప్రసాద్ పేరూరి, డా. మాధురి నల్లమోతు, డా. రాజా అశోక్ కోగంటి వ్యవహరించారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కిషన్ రెడ్డి



భీమవరం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూలై 4వ తేదీన భీమవరంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటించనున్న ప్రాంతాలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక పెద్దఅమిరంలోని వివిధ ప్రాంతాలను జిల్లా కలెక్టర్, ఎస్ పి, జాయింట్ కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, బిజెపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధానమంత్రి, ఇతర మంత్రులు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రుల హెలికాప్టర్ల లాండింగ్ స్థలాలను, సభాస్థలి ప్రాంతాలను మంత్రి పరిశీలించారు, సభాస్థలి వద్ద వివీఐపీలకు గ్రీన్ రూమ్, విఐపిలకు వెయిటింగ్ రూములను ఎక్కడ ఏర్పాటు చేయాలి, సభాస్థలి లోనికి ప్రజలను ఎక్కడనుండి అనుమతించాలి, సభాస్థలి సమీపంలో పార్కింగ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి, ప్రజలను ఏవిధంగా బయటకు పంపించాలి తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సభాస్థలి పనులు చేయాలని ప్రజలు లోనికి ఎటునుండి రావాలి, ఎటు వెళ్లాలి, వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్, సామాన్య ప్రజల పార్కింగ్ తదితర ఏర్పాట్లను ముందుగానే చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ యూ. రవిప్రకాష్ , జెసి జె వి. మురళి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు సోము వీర్రాజు, ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు, మాజీమంత్రులు కామినేని శ్రీనివాస్, కనుమూరి బాపిరాజు, కె. శివరామరాజు, గోకరాజు గంగరాజు, పి.సర్రాజు, భీమవరం ఆర్డిఓ దాసి రాజు, ఆర్అండ్ బి, వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్ సర్వీస్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలపై ఆర్థికభారం మోపుతున్న ప్రభుత్వాలు



నరసాపురం, జూన్ 12 (ప్రజాపాలన ప్రతినిధి) : జనం కోసం సిపిఎం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఒకటో వార్డులో సిపిఎం బృందం ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టి వేస్తున్నాయని ఓట్లు వేసి గెలిపించిన ప్రజలపై కక్ష గట్టినట్టు ప్రజలను అనేక విధాలుగా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. రోజురోజుకు ప్రజలపై ఆర్థిక భారం వేస్తూ ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారనీ అన్నారు. నిత్యజీవితంలో ప్రజానీకం ఉపయోగించే పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు బిల్లులు, ఔషధాలు మరియు వంటనూనె, ఉప్పు, పప్పులు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలము, ఇల్లు లేక అద్దెఇంట్లో ఉంటూ అద్దె చెల్లించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇల్లులేని ప్రజానీకానికి ఈమూడు సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు స్థలం గాని, ఇల్లు నిర్మించడం గాని జరగలేదని ప్రజానీకం వాపోతున్నారని అన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వటంలో కాలయాపన చేయడం తప్ప ఆచరణలో అమలు చేయటంలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, వంగా సాగర్, శివరాజు, పైలా అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన జైత్రయాత్ర..



మచిలీపట్నం టౌన్ 12 , ప్రజాపాలన :కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో రెండవ రోజు ఆదివారం ఉదయం బందరు కోట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద నుండి ఊరేగింపు మొదలై బందరు కోట పురవీధుల్లో పర్యటించింది. బందరు కోట జగిగిన ఊరేగింపులో మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణ రావు , మాజీ చైర్మన్ బాబా ప్రసాద్ పాల్గొనడం జరిగింది.మధ్యాన్నం గిలకల దిండి వేణుగోపాల్ స్వామి గుడివద్ద వద్దకు చేరుకున్నారు. తదుపరి గిలకల దిండిలో ఊరేగింపు మొదలై తిరిగి సాయంత్రం బందరు కోట శ్రీ కోదండ రామాలయం వద్ద యాత్ర విజయవంతంగా ముగుస్తుంది.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదు: ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లు, అనుమానితులు మరియు చెడు నడత గల వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్సై వెంకట ప్రసాద్. నేరస్తుల ప్రస్తుత జీవన విధానం, చేస్తున్న వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలు మరియు ఇతర వ్యక్తి గత వివరాలను అడిగి తెలుసుకొని చట్టవ్యతిరేకమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరిక ఈ మేరకు రౌడీ షీటర్ల కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని సమీక్షించి మాట్లాడుతూ. రౌడీ షీటర్లు, అనుమానితులు మరియు చెడు నడత గల వారు తమ నేర స్వభావాన్ని మార్చుకోవాలన్నారు చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనరాదన్నారు. అలా కాదని ఎవరైనా పాత నేర స్వభావాన్ని కొనసాగిస్తూ పదే పదే నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని, పీడి చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు.ఏదైనా నేరానికి పాల్పడితే ఆ నేరానికి సంబంధించిన కేసులతో పాటు పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తీవ్రంగా హెచ్చరించారు.దీని వలన న్యాయస్థానల్లో అప్పీలు చేసుకోవడానికి వీలులేని జైలు జీవితం గడపవలసి వస్తుందని తెలిపారు. ప్రతి నేరస్తుడిపై పటిష్ఠ నిఘా నిరంతరం ఉంటుందని,చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్- క్రాఫ్ ఆధ్వర్యంలో..

# ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం




చేబ్రోలు 12 జూన్ ప్రజా పాలన ప్రతినిధి చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్- క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్య, కళలు మీడియా ద్వారా బాలల హక్కులకు మద్దతు ఇవ్వాలి అనే పోస్టర్ ను చేబ్రోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ చేతుల మీదుగా ఆవిష్కరించి గ్రామంలోని ప్రధాన సెంటర్లో అంటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన తీసుకు రావటానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని. 18 సంవత్సరాల లోపు సాధారణ పాఠశాలలో చేరి చదువుకోవలసిన వయసు సామర్థ్యానికి ఆటంకం కలిగించే మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, నైతికంగా హాని కలిగించే ఏ విధమైన పని ద్వారా బాలల శ్రమ దోపిడి చేయటాన్ని బాల కార్మిక వ్యవస్థ అంటారని సభ్యులకు తెలియజేశారు. చాలా మంది బాలలు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారని, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకారం బాల కార్మికులు అనేది బాలల యవ్వనం, సామర్థ్యాన్ని మరియు గౌరవాన్ని కోల్పోయి, ఉపాధి వారి శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని, మన గ్రామంలో మరియు చేబ్రోలు మండలంలో బాలకార్మికులను గుర్తించి వారికి ప్రభుత్వ వసతులను కల్పించి సంపూర్ణ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం అందరి బాధ్యత అని, 18 సంవత్సరాలు లోపు బాలకార్మికులను పనిలో పెట్టడం నేరమని, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా బాలల రక్షణ కమిటీ మరియు బాలల పంచాయతీ సభ్యులు పనిచేయాలని కోరుతూ, మన గ్రామాన్ని బాలల స్నేహ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాతంగి శ్యామల, కొక్కిలిగడ్డ కిరణ్‌కుమార్, చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్- క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి. వెంకయ్య,గ్రామ పెద్దలు సేకూరు ప్రసాద్, రేపూడి భాస్కర్, సి. హెచ్. రాఘవులు, బాలాల పంచాయతీ బాలలు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వేడెక్కుతున్న ఏపీ పాలిటిక్స్

విజయవాడ, జూన్ 12, :వైసీపీ మూడేళ్ల పాలనపై మాటల యుద్ధం పీక్‌కి చేరింది. వైసీపీ హయాంలో హత్యలు, అక్రమ కేసులు తప్ప మరేమీ లేవంటూ బుక్‌లెట్‌ను విడుదల చేసింది తెలుగుదేశం. సీఎం జగన్ రాష్ట్రానికి.వైసీపీ మూడేళ్ల పాలనపై మాటల యుద్ధం పీక్‌కి చేరింది. వైసీపీ హయాంలో హత్యలు, అక్రమ కేసులు తప్ప మరేమీ లేవంటూ బుక్‌లెట్‌ను విడుదల చేసింది తెలుగుదేశం. సీఎం జగన్ రాష్ట్రానికి పట్టిన అరిష్టమని తీవ్ర వ్యాఖ్యలే చేశారు చంద్రబాబు. టీడీపీ అధినేత ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని కౌంటర్లు ఇస్తోంది వైసీపీ. మరోవైపు టెన్త్ ఫలితాలపై చర్చకు సై అంది అధికార పార్టీఏపీలో మూడేళ్ల పాలనపై వైసీపీ, టీడీపీ మధ్య రాజకీయ యుద్ధం కంటిన్యూ అవుతోంది. ఈ మూడేళ్లు అరాచక పాలన అంటూ ఫొటో గ్యాలరీ పెట్టింది టీడీపీ. దీనిపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు చంద్రబాబు. ఈ మూడేళ్లలో జరిగిన ఘటనలను వివరిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉండే రాష్ట్రాన్ని వల్లకాడు చేశారని, పోలీసులు వైసీపీ రౌడీల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు వ్యవసాయం గురించి మాట్లాడిన వెంటనే రుతుపవనాలు ఆగిపోయాయని, ఆయనే అరిష్టమని విమర్శించారు మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి. చంద్రబాబు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు మంత్రి జోగి రమేష్.

## కీలకం కానున్న వైసీపీ ఓటు

విజయవాడ, జూన్ 12, :రాష్ట్రపతి ఎన్నికల్లో ఇప్పుడు వైసీపీ కీలకంగా మారుతోంది. ఎన్నికల సంఘం రాష్ట్రపతి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన జారీ చేయటంతో..ఇప్పుడు ఇందులో ఏ పార్టీకి ఏ మేర ప్రభావం చూపిస్తోంది.. ఎంత మేర ఓట్ల విలువ ఉందనే చర్చ మొదలైంది. ప్రధానంగా ఎన్డీఏ - కాంగ్రెస్ మద్దతు కూటమి మధ్య ఓట్ల తేడాలో స్వల్పంగా ఎన్డీఏ వ్యతిరేక కూటమికి ఎక్కువ ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న రాజ్యసభ ఎన్నికలు సైతం ఇందులో భాగంగానే హోరా హీరీగా మారాయి. దీంతో..మూడు ప్రాంతీయ పార్టీలైన బీజేడీ..టీఆర్ఎస్..వైసీపీ క్రియాశీలకంగా మారాయి. టీఆర్ఎస్ ఇప్పటికే ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉంది. వైసీపీ ఎన్డీఏలో భాగస్వామి కాకపోయినా.. పలు కీలక సందర్భాల్లో మద్దతిస్తూ వచ్చింది. గత రాష్ట్రపతి ఎన్నికల్లోనూ అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ మద్దతు ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రధాని మోదీ - సీఎం జగన్ తో చర్చించారు. జగన్ మద్దతు ఇస్తే..బీజేడీ పార్టీ ఎన్డీఏ మద్దతు ఇచ్చినా..ఇవ్వకపోయినా పెద్దగా ప్రభావం పడదు. ఇక, ఓట్ల శాతంలో చూస్తే.. ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ - రాజ్యసభ లో మొత్తం 36 మంది ఎంపీల ఓటు విలువ 25,488గా ఉంది. అదే విధంగా.. అసెంబ్లీలో 175 మంది ఎమ్మెల్యేల ఓట్ల విలువ 27,825 గా నిర్ధారించారు. దీంతో..రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేల మొత్తం ఓటు విలువ 53,313 గా ఉంది. ఇందులో వైసీపీ ఓటు వాటా 45,957 గా నిర్ధారణ అయింది వైసీపీకి నాలుగు శాతం ఓటు షేర్ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 25 ఉండగా, ఇందులో 22 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీలు, ముగ్గురు టీడీపీకి చెందిన ఎంపీలున్నారు. రాజ్యసభ స్థానాలు 11 ఉండగా ఇందులో వైస్సార్‌సీపీకి చెందిన ఎంపీలు 9 మంది, టీడీపీ, బీజేపీలకు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. రాష్ట్ర జనాభా లెక్కన ఎంపీలు..ఎమ్మెల్యేల ఓటు విలువ నిర్ణయిస్తారు. 1971 జనాభా లెక్కల ప్రాతిపదికన దీనిని డిసైడ్ చేస్తున్నారు. దీంతో..ఏపీలో ఒక్కో ఎంపీ ఓటు విలువ 708గా ఉంది. ఆ లెక్కన ఒక్కో ఎమ్మెల్యే ఓటు విలువ 159గా నిర్ధారించారు. రాష్ట్రంలో మొత్తం 175 మంది ఎమ్మెల్యేల ఓట్ల విలువ 27,825గా నమోదైంది. రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేల ఓటు విలువ 53,313గా ఖరారు చేసారు. అభ్యర్థి ప్రకటన వచ్చేకా తుది నిర్ణయం వైసీపీ నుంచి లోక్‌సభ సభ్యులు 22 మంది, రాజ్యసభలో మరో 9 మంది ఎంపీలకు కలిపి మొత్తం ఓటు విలువ 21,948 కాగా, 151 మంది ఎమ్మెల్యేలకు 24,009 ఓటు విలువ ఉంది. ఈ లెక్కన దేశ వ్యాప్తంగా ఎలక్టోరల్ కాలేజీలో వైసీపీ ఓట్ షేర్ నాలుగు శాతం వరకు ఉందని తేల్చారు. ఏపీ నుంచి ఉన్న మొత్తం 53,313 ఓటు విలువలో వైఎస్సార్‌సీపీ 45,957 ఓటు విలువ కలిగి ఉంది. దీంతో..అభ్యర్థులు ఖరారు అయిన తరువాత పార్టీల నుంచి తమ మద్దతు విషయం పైన అఫీషియల్ ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. దీంతో..ఇప్పుడు వైసీపీ అధినేత జగన్ నిర్ణయం కీలకంగా మారబోతోంది.

## రాష్ట్ర వ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..

అమరావతి, : యోగా భారతీయ వారసత్వ సంపదలో భాగమని, ప్రపంచమంతా యోగా వైపు చూస్తున్న తరుణంలో మనము యోగాని అనుసరించడం ద్వారా ఆరోగ్యాన్ని పొందాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు సూచించారు. ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా జరుగబోవు 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవవేడుకల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం కోసం, యోగా వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియ చెప్పటం కోసం ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగము ఆదివారం ఉదయం 6గంటలకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ, ఈనెల 21న ప్రధాన కార్యక్రమం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతుందని, రాష్ట్రంలోని 75 ఇతర ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ర్యాలీని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్తిల్ దినకర్ , ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నూపుర్ జెండా వూపి ర్యాలీ ని ప్రారంభించారు. స్టేడియం నుండి ప్రారంభమైన ర్యాలీ డీవీమానర్, సిద్దార్థ కళాశాల,జమ్మిచెట్టు- సెంటర్, శిఖామణి సెంటర్ మీదుగా తిరిగి స్టేడియం వద్దకు చేరింది. ఈ ర్యాలీ లో ఆయుర్వేద కళాశాల, బుద్ధ యోగ



ఫౌండేషన్, సిద్దార్థ మహిళా కళాశాల ప్రతినిధులతో పాటు- ఆయుష్ శాఖ ఉద్యోగులు 500 మందికి పైగా పాల్గొన్నారు. తదనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పలువురితో కల్సి యోగాసనాలు వేశారు.

## పవన్ కల్యాణ్ సమర శంఖం



విజయవాడ, జూన్ 12, :జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమర శంఖం పూరించారు. ఇకపై జనాల్లోనే ఉండనున్నారు. పవన్ కల్యాణ్ త్వరలో రాష్ట్రవ్యాప్త పర్యటన చేయబోతున్నారు. అక్టోబరు 5న తిరుపతి నుంచి సేనాని యాత్ర ప్రారంభం కానుంది. విజయదశమి నుంచి జిల్లాల పర్యటనకు పవన్‌కల్యాణ్ అండ్ టీమ్ రూట్ మ్యాప్ కూడా రెడీ అయిపోయింది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా పవన్ ప్రచారం చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో పర్యటన ఉండేలా షెడ్యూల్ రూపొందిస్తున్నారు. 6నెలల్లో రాష్ట్రమంతా పర్యటన, ప్రతి ఉమ్మడి జిల్లాలో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. మార్చి, ఏప్రిల్ లోనే ఎన్నికలు ఉంటాయని జనసైనికులు సిద్ధంగా ఉండాలని నాదెండ్ల మనోహర్ సూచించారు. ఇప్పటి వరకూ అంగీకరించిన సినిమాల షూటింగ్స్ ను అక్టోబర్ వరకూ కంప్లీట్ చేసి .. అప్పట్నుంచి పూర్తి స్థాయిలో ప్రజల్లోనే ఉండాలని పవన్ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. పవన్ పర్యటనపై జనసేన పీఏసీ సభ్యుడు కొణిదెల నాగబాబు కూడా స్పందించారు. తిరుపతి నుంచి అక్టోబర్ 5న విప్లవం ప్రారంభమవుతుందన్నారు.

# హైదరాబాద్ కేంద్రంగా సౌత్ పై గురి

హైదరాబాద్ , జూన్ 12, :భారతీయ జనతాపార్టీ, ఆ పార్టీ నాయకులు పదేపదే చెప్పుకునే విధంగా దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యదిక సభ్యత్వం ఉన్న,అతి పెద్ద రాజకీయ పార్టీ, అయితే కావచ్చును. కానీ, వింధ్యకు అవలే కానీ, గీత దాటి దక్షిణాదిలోకి వస్తే, కమల దళానికి ఒక్క కర్ణాటక మినహా మరో రాష్ట్రంలో అంతగా రొమ్ము విరుచుకునే స్థాయిలో బలం లేదు. బలగం లేదు. ఈ మధ్య కాలంలో తెలంగాణలోనూ బీజేపీ కొంత పుంజుకుంటోంది. 2019 లోక్ సభ ఎన్నికలలో అనూహ్యంగా నాలుగు స్థానాలు గెలుచుకుంది. ఆ తర్వాత దుబ్బాక, హుజురాబాద్ అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించింది. ఇక ఆక్కడ నుంచి బీజేపీ దూకుడు పెంచింది. అధికార తెరాస, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలకు సమ ఉజ్జీగా గట్టి పోటీ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. తమిళనాడులోనూ దూకుడు పెంచింది. ఏపీ, కేరళలో ప్రయత్నం జరిగిన అడుగులుపడడం లేదు. అయినా మొత్తంగా చూస్తే, ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే, దక్షిణాదిన బీజేపీ ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి వుంది. అందులో సందేహం లేదు. ఈనిజాన్ని, ఆ పార్టీ నాయకులే అంగీకరిస్తారు. మొత్తం ఐదు దక్షిణాది రాష్ట్రాలలో 129 లోక్ సభ స్థానాలుంటే, 2019 ఎన్నికలో బీజేపీ ఖాతాలో చేరింది ఆ పై 29 సీట్లు మాత్రమే (కర్ణాటక 25, తెలంగాణ 04) ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కమలదళం ఖాతానే తెరవలేదు. అయితే, ఇప్పుడు కమలనాధులు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టిని కేంద్రీకరించారు. 2024 లోక్ సభ ఎన్నికలలో, ఇప్పుడున్న స్థానాలకు రెట్టింపు స్థానాలు గెలుచుకునేలా, వ్యూహ రచన చేసిన బీజేపీ ఆచి తూచి, అతి జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. ఇదే సమయంలో,లోక్ సభ ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు జరిగే తెలంగాణ శాసన సభ ఎన్నికలపైనా కాషాయ దళం దృష్టిని కేద్రేకరించింది. అందితే అధికారం, కాదంటే కనీసం ప్రధాన ప్రతిపక్షం స్థాయికి చేరుకునేదుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇలా ఒకరి వెంట ఒకరు రాష్ట్రంలో పర్యటించి పట్టు పెంచే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ క్యాడర్'లో జోష్ పెంచే ప్రయ్తాన్ చేస్తున్నారు. మరోవంక తెరాస వ్యతిరేకతే ప్రధాన అజెండాగా రాజకీయం చేస్తున్న కొండా విశ్వేశ్వర రెడ్డి వంటి వివిధ పార్టీల నాయకులు కమల వైపు చూస్తున్నారు. ఇప్పటికైతే ఇటు నేతల దృష్టిలో, అటు ప్రజల దృష్టిలోనూ కూడా, తెరాసకు బీజేపీనే ప్రధాన ప్రత్యర్ధి అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో పట్టు పెంచుకోవడం లక్ష్యంగా, తెలంగాణ నుంచి దండయాత్రను ప్రారంభించేందుకు, కమల దళం, సుమారు రెండుదశాబ్దాల తర్వాత జులై 2,3 తేదీలలో బీజేపీ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‘లో నిర్వహించాలని నిర్ణయించింది, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో ఏర్పడిన ఐదుగురు సభ్యుల కమిటీ, ఆపనిలో నిమగ్నమైంది. జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగే రెండు రోజులు భాగ్యనగరం కాషాయమయం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ కీలక నేతలందరూ హైదరాబాద్‌లో కొలువు దీరనున్నారు. పదహారు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సుమారు 40 మందికి పైగా కేంద్ర మంత్రులు, జాతీయ స్థాయి పథాదికారులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పార్టీ కీలక నేతలందరూ హాజరు కానున్నారు. సమావేశాలు జరిగే 2 రోజుల పాటు ప్రధాని మోడీ రాజ్ భవన్‌లో బస చేయనున్నట్లు తెలుస్తోంది. సరే, ఏర్పాట్ల విషయం ఎలా ఉన్నా, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ కాకుండా, జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్' లో నిర్వహించాలనే నిర్ణయం వెనక భారీ స్కెచ్ ఉందని రాజకీయ, మీడియా వర్గాలో చర్చ జరుగుతోంది. మనం ఇంతకు ముందే అనుకున్నట్లుగా, దక్షినాది రాష్ట్రాలలో పార్టీ నిర్మాణం ప్రధాన లక్ష్యం అయితే, తెలంగాణలో తెరాసను గద్దెదించి, కాషాయ జెండా ఎగరేయడమే జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్'లో నిర్వహించడం వెంక ఉన్న మరో ప్రధాన లక్ష్యమని వేరే చెప్పనక్కర లేదు. అయితే అది అయ్యే పనేనా, ఉత్తర బారత పార్టీగా ముద్ర వేసుకున్న బీజేపీ దక్షిణాదిలో పాగా వేయడం సాధ్యమేనా? ముఖ్యంగా వంతుల వారీగా అధికార, ప్రతిపక్ష భూమికను పోషించే ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న తమిళ నాడు, ఆంధ్ర ప్రదేశ్' రాష్ట్రాలలో బీజేపీ, నిలబదగాలుగుతుందా? అంటే, బీజేపే నాయకులు ఈశాన్య రాష్ట్రాల వైపు చూడండి... లుక్ నార్త్ ఈస్ట్ .. అంటున్నారు. ఒకప్పుడు ఒకటి రెండు శాతం ఓటు కూడా లేని అస్సాం, త్రిపురలలోనే కాదు, ఎనిమిదికి ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ, మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయని అంటున్నారు. అలాగే, పశ్చిమ బెంగాల్'లోనూ అధికారంలోకి రాలేక పోయినా, కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలను 'జీరో' కు చేర్చి. బీజేపీ ప్రధాన ప్రతిపక్ష హోదాను పొందిందని, బీజేపీ నాయకులు ధీమాగా ఉన్నారు. మరోవంక రాజకీయ విశ్లేషకులు కూడా 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ, 30 - 40 సీట్లతో ప్రధాన ప్రతిపక్ష స్థాయికి చేరుకున్నా, తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే అవుతుందని, రాష్ట్రం నుంచి బీజేపీ ఆశిస్తున్న విధంగా సగానికి పైగా లోక్ సభ స్థానాలను సునాయాసంగా గెలుచు కుంటుందని అంటున్నారు. అలాగే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలతో దినదిన ప్రవర్తమానంగా దిగజారి పోవడం, జాతీయ నాయకత్వం అంతే వేగంతో బలహీనమవడం కూడా బీజేపీకి కలిసొచ్చె అంశాలుగా పరిశీలకులు భావిస్తున్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్'లో నిర్వహించినంత మాత్రాన, ఆ ఒక్క కారణంగా తెలంగాణలో, దక్షణాది రాష్ట్రాలలో బీజేపే బలాన్ని పుంజు కుంటుందని అనుకుంటే పొరపాటే అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ సందర్భంగా 2004 లోక్ సభ ఎన్నికలకు ముందు, దక్షణాది రాష్ట్రాలకు చెందిన వెంకయ్య నాయుడు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నరోజుల్లోనే, 2003 చివర్లో, హైదరాబాద్'లోనే పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. అయినా .. ఆవెంటనే జరిగిన లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఏమిటో... వేరే చెప్పనక్కరలేదు. అటల్జీ పాలనలో దేశం వెలిగి పోతోందని ప్రచారం జరిగినా .. ఆ ఎన్నికలలో కమలం వాడి పోయింది. కాంగ్రెస్ సారధ్యంలో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం పదేళ్ళ దేశాన్ని పాలించింది. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ కూటమి అధికారం కోల్పోయింది. అంతకు ముందు పదేళ్ళు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర విభజన వరకు పదేళ్ళు ఉమ్మడి రాష్ట్రాని హస్తం పార్టీ పాలించింది. సో .. హైదరాబాద్'లో జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించడం వల్ల మాత్రం చేతనే బీజేపీ దక్షిణాదిన / తెలంగాణలో జెండా పాతేస్తుందని అనుకోవడం కుదరదని పరిశీలకులు అంటున్నారు. అయితే, రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణం కమల వికాసానికి అనుకూలంగా ఉందని మాత్రం అందరూ అంగీకరిస్తున్నారు.

# విద్యుత్ వ్యవస్థలో ప్రతి చర్య ప్రజలకోసమే..

## బీఈఈ సహకారంతో ఏపీ ఇంధన శాఖ ప్రణాళిక



అమరావతి, : రాష్ట్రంలో 2030 నాటికల్లా 6.68 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వలెంట్ (ఎంటీ-వోఈ) ఇంధనాన్ని పొదుపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఇందుకు సహకరిస్తుందన్నారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారం తీసుకుంటు న్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో పెరగనున్న ఇంధన డిమాండ్ అందుకోవడానికి ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలే తక్షణ పరిష్కారమని చెప్పారు. ఇందుకోసమే ఇంధన రంగంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఇంధన సామర్థ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యాలకు ఇది దోహదపడుతుందని, ప్రతి కుటుంబం దీని వల్ల ప్రయోజనం పొందుతుందని తెలిపారు. విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న అది ప్రజా ప్రయోజనాలు పరిరక్షించడం కోసమేనని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ రంగం బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎన్నడూ రాజీ పడదని స్పష్టం చేశారు.

**నిరంతర విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం..**

24/7 నాణ్యమైన చౌక విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈలక్ష్య సాధనకు ఇంధన సామర్థ్య కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. చౌకలో నాణ్యమైన , తగినంత విద్యుత్ లభ్యత రాష్ట్రంలో ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. దీనివల్ల 24/7 విద్యుత్ సరఫరా మరింత పటిష్టమవుతుందని, ఇది అంతిమంగా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి ఉపకసరిస్తుందని పేర్కొన్నారు. గతంలో కోవిడ్ సమయంలో వినియోగదారులకు, ఆస్పత్రులకు తదితర కేటగిరీలకు, ఇటీవల దేశ వ్యాప్తంగా ఎంతటి బొగ్గు కొరత సంక్షోభం ఉత్పన్నమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు నాణ్యమైన నమ్మకమైన కరెంటును అందచేయటంలో రాజీ పడలేదని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలు, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, రాష్ట్రంలో ప్రతి కుటుంబ సంక్షేమానికి కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టు బడి ఉన్నారు. ఇంధన పొదుపు, సామర్థ్య పెంపు, ట్రాన్స్‌మిషన్ లాస్ తగ్గించుకోవడంలో, పునరుత్పాదక ఇంధన వనరులను పెంపొందించడం, వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడంలో రాష్ట్ర విద్యుత్ రంగం దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యుత్ రంగంగా పేరు తెచ్చుకుందని మంత్రి గుర్తుచేశారు. మున్ముందు కూడా వినియోగదారుల అవసరాలు ఆకాంక్షలు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థ పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

**2070 నాటికి కాలుష్య రహిత రాష్ట్రంగా :**

దేశాన్ని 2070 నాటికి కాలుష్య రహితంగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇంధన సామర్థ్య కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని బీఈఈ కోరింది. దీనిలో భాగంగా బీఈఈ సెక్రటరీ ఆర్‌కే రాయ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసిఎం) అధికారులతో ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు ద్వారా 2030 నాటికీ దేశంలో 45 శాతం ఇంధన వినియోగ అవసరం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందుకోసం అన్ని రాష్ట్రాలు ఇంధన పొదుపు కార్యాచరణను తయారు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం జరుగుతుందన్నారు.

**ఏపీలో అనేక కార్యక్రమాలు :**

ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య పెంపు లక్ష్యాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే రాష్ట్ర ఇంధన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సత్వరమే చర్యలు తీసుకుందని ప్రశంసించారు. ఏపీని ఇంధన సామర్థ్య రాష్ట్రంగా మార్చడం పట్ల ప్రభుత్వానికున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. దీని వల్ల రాష్ట్రం అనేక విధాలుగా ప్రయోజనం పొందుతుందన్నారు. ఇందుకోసం ఇంధన సామర్థ్య రంగంలో పెట్టుబడులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంధన సామర్థ్య రంగంలో జాతీయ స్థాయిలో రూ.10.02 లక్షల కోట్ల పెట్టు బడులకు అవకాశం ఉందన్నారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థికాభివృధితో పాటు ఉపాధి కల్పన, పర్యావరణం మెరుగవుతుందని పేర్కొన్నారు.

**కీలక రంగాలను భాగస్వాములను చేయాలి..**

ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యమైన 6.68 ఎంటీ-ఓఈ ఇంధన పొదుపు సాధనకు అన్ని కీలక పరమైన రంగాలను భాగస్వాములుగా చేయవల్సిందిగా బీఈఈ కార్యదర్శి కోరారు. జాతీయ స్థాయి లక్ష్యమైన 150 ఎంటీ-ఓఈ ఇంధనం పొదుపునకు ఇది దోహదపడుతుందని 887 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను 2030 నాటికీ తగ్గించడంలో కూడా దోహదకారి అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో వార్షిక విద్యుత్ డిమాండ్ దాదాపు 66000 మిల్లియను యూనిట్లు ఉండగా అందులో దాదాపు 15000 మిలియన్ యూనిట్లు- పొదుపుచేసే అవకాశం ఉందని ఏపీఎస్ఈసిఎం అధికారులు వివరించారు. ప్రధానంగా పారిశ్రామిక, మునిసిపల్, వ్యవసాయ, గృహ వినియోగ రంగాలలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఇందుకోసం ప్రస్తుతం రూపొందిస్తున్న రాష్ట్ర ఇంధన కార్యాచరణ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. ఇందుకు సహకారం అందిస్తున్న బీఈఈ కు ఏపీఎస్ఈసిఎం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# డెంగ్యూ టెన్షన్..టెన్షన్

హైదరాబాద్, జూన్ 12, :దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోకి నైరుతి రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చాయి. తొలకరి జల్లులు పలకరిస్తున్నాయి. దీంతో వేడి నుంచి కొంత ఉపశమనం లభించింది. అయితే వేసవి నుంచి ఉపశమనంతో పాటు సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాద ఘంటికలు కూడా మోగుతున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వచ్చే ప్రమాదం ఉంది. ప్రతి సంవత్సరం వర్షాకాలం నుండి అక్టోబర్ వరకు డెంగ్యూ-మలేరియా వ్యాధుల బారిన అధిక మంది పడుతున్నారు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ఓఅఅ డెంగ్యూ కేసులపై ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం, జనవరి 1, 2022 నుండి మే 28, 2022 వరకు, 111 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో, ఈ కాలంలో 18 మలేరియా కేసులు నమోదయ్యాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో డెంగ్యూ-మలేరియా కేసులు కూడా నమోదుతున్నాయి. ఈ వ్యాధుల వలన చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. కనుక ఈ వ్యాధులను తేలికగా తీసుకోకూడదని వైద్య సిబ్బంది హెచ్చరిస్తున్నారు.ఆడ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగ్యూ వస్తుంది. ఈ దోమలు మురికిలో కాకుండా పరిశుభ్రమైన ప్రదేశాల్లో వృద్ధి చెందుతాయి. నగరాల్లో పరిశుభ్రమైన ప్రదేశాల్లో నివసించే వారు డెంగ్యూ బారిన పడుతున్నారు. ఇది టైప్-1, టైప్-2, టైప్-3 , టైప్-4 అని నాలుగు రకాలు. దీనిని బ్రేక్ బోన్ ఫీవర్ అని కూడా అంటారు.డెంగ్యూ జ్వరం రకాన్ని బట్టి లక్షణాలు ఉంటాయి. చలి జ్వరం, ముక్కు నుంచి లేదా చిగుళ్ళు నుంచి రక్తం వస్తుంది. కొన్ని సార్లు బాధితుడు స్పృహ కోల్పోతాడు. రక్తపోటును కూడా తగ్గిస్తుంది. తలనొప్పి, కండరాల, ఎముక నొప్పి, ముసిముసి నవ్వులు, కళ్ళు నొప్పి, చర్మం పై దద్దుర్లు, నోరు రుచిని కోల్పోవడం వంటివి సాధారణ లక్షణాలుఇంటి లోపల, వెలుపల నీరు నిలిచిపోకుండా ఏర్పాటు చేసుకోండి. నీరు నిల్వ ఉందని విధంగా ప్రదేశాలను శుభ్రంగా ఉంచండి.. వాటర్ ట్యాంక్‌ను మూతపెట్టి ఉంచండి. వారానికి ఒకసారి గది కూలర్ , వాటర్ ట్యాంక్‌లో పెట్రోల్ లేదా కిరోసిన్ చల్లండి ఫ్రిజ్ దిగువన ఉన్న వాటర్ ట్రేని రోజూ శుభ్రం చేసుకోండి. డెంగ్యూ జ్వరం వచ్చిన వ్యక్తి రక్తంలో ప్లేట్‌లెట్ కౌంట్ గణనీయంగా తగ్గడం ప్రారంభించినప్పుడు డెంగ్యూ మరింత తీవ్రమవుతుంది. ప్లేట్‌లెట్స్‌ని క్లాటింగ్ సెల్స్ అంటారు. కనుక ఎవరికైనా ప్లేట్‌లెట్ కౌంట్ స్థాయి ఇప్పటికే తక్కువగా ఉంటే.. వీరు ఇతరులకన్నా త్వరగా డెంగ్యూ బారిన పడవచ్చు.

# జిల్లా కోర్ కమిటీల నిర్మాణానికి బహుజనులకు ఆహ్వానం పలికిన అంబేద్కర్ టీవీ ఛానల్...



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):గత 20 సంవత్సరాల నుండి అంబేద్కర్ ఫిలాసఫీతో స్నేహ గ్రూప్ ,సాంఘికంగా ,పే బ్యాక్ టు సొసైటీ సిద్ధాంతాలతో, బహుజన ఆర్థికాభివృద్ధికి , ప్రజా మీడియా నిర్మించి పని చేస్తున్న విషయం మీ అందరికీ విదితమే.ఈ అంబేద్కర్ టీవీ ఛానల్ కు జిల్లా కోర్ కమిటీ ల నిర్మాణానికి బహుజనులందరికీ ఆహ్వానం పలికారు స్నేహ సంస్థ ల, అంబేద్కర్ టీవీ ఛానల్ చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావుIRS vrs .

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**

ఎల్లప్పుడు టీవీ స్క్రీన్ మీద అంబేద్కర్ ,పూలే , బుద్ధుని ఫోటోలతో 24 గంటలు చాలెంజ్ గా చూపిస్తూ ,బహుజన వార్తలను ముఖ్యమైన వార్తలుగా టెలికాస్ట్ చేస్తూ ,బహుజన రాజ్యాధికార సాధనకు పాలుపంచుకోవడానికి ఛానల్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు.అంబేద్కర్ టీవీ ఛానల్ నిర్మాణము ,నిర్వహణలో పాలు పంచుకోవటానికి ఒక్కొక్క జిల్లాకు ఒక కోర్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కోర్ కమిటీలో పనిచేయటానికి ఇష్టమైనవారు ఈ నెంబర్ కు వాట్సఅప్ ౦91 98854 09088 చేయగలరని ఆయన తెలిపారు.

# మొదలైన ఎన్నికల కసరత్తు ..!

**క్షేత్రస్థాయిలో నేతల పనితీరుపై తెదేపా అధిష్ఠానం కన్ను..**



అమరావతి, : తెలుగుదేశం పార్టీ ఎన్నికల కసరత్తును ఇప్పటికే మొదలుపెట్టింది. సార్వత్రిక ఎన్నికలకు మరో రెండేళ్ల గడువు ఉన్నప్పటికీ ముందస్తు ఆలోచనతో సమగ్ర ప్రణాళికలను రచిస్తూ నియోజకవర్గాల్లో పాగా వేసేందుకు వ్యూహరచన చేస్తోంది. మహానాడు సక్సెస్ జోష్‌ను, ఊపును ఏమాత్రం చేజారనీయకుండా పకడ్బందీ వ్యూహాలు రూపొందించి బలమైన ప్రణాళికతో నేతలను ముందుకు నడిపిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలు నిత్యం ప్రజల్లో ఉండేలా అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేస్తూ అవసరమైన సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇస్తున్నారు. నిత్యం ఏదోఒక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల్లో ముఖ్యనేతల పనితీరుపై అధిష్ఠానం కన్నేసింది. అధికారానికి దూరమై మూడేళ్లు కావొస్తున్నా.. ఇంకా గడపదాటని నేతలకు పరోక్షంగా సంకేతాలను పంపిస్తున్నారు. పార్టీ జయాపజయాలు, బలాబలాలను పక్కకు పెడితే అసలు నియోజకవర్గస్థాయి నేతలు పార్టీకి ఎలాంటి సేవలు అందిస్తున్నారు. ప్రజలతో కలిసి నడుస్తున్నారా? అన్న అంశాలపై రహస్య సర్వేలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నేతల పనితీరు, వారి కదలికలు, గ్రూప్ విభేదాలను సేకరించేందుకు ప్రత్యేక టీమ్‌లను అధిష్ఠానం ఏర్పాటు చేసినట్లుగా స్పష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పలు కార్యక్రమాల నిర్వాహణకు అధిష్ఠానం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాల్లో నేతలు ఎంత వరకు పాల్గొన్నారు, ఎవరెవరు దూరంగా ఉన్నారన్న అంశాలపై సమగ్ర సమాచారాన్ని పార్టీ బృందాలు సేకరించాయి. నియోజకవర్గాలను వదిలి పార్టీ కేంద్ర కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే నేతలకు ఇటీవల ఆ పార్టీ అధినేత చంద్రబాబు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. నియోజకవర్గాల్లో ఉండకుండా పార్టీ కార్యాలయం చుట్టూ తిరగడమంటని పలువురు నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీ విభేధాలు రచ్చకెక్కుతున్న నియోజకవర్గాలపై కూడా అధిష్ఠానం సీరియస్ దృష్టి పెట్టింది. ఎక్కడైతే విభేధాలు ఉన్నాయో ఆయా నియోజకవర్గాల నేతలతో పాటు పార్లమెంట్ ఇంఛార్జ్‌లను పిలిపించి పార్టీ కార్యాలయంలో చంద్రబాబు వరుస సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. రచ్చకెక్కితే చర్యలు తప్పవన్న హెచ్చరికలను జారీ చేయడమే కాకుండా కేడర్‌ను నిరుత్సాహానికి గురిచేసి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే వేటు తప్పదన్న సంకేతాలను కూడా నేరుగా ఇచ్చారు. మరోవైపు నియోజకవర్గాల్లో ఏదో చుట్టపుచూపుగా పర్యటించే నేతలకు కూడా సీరియస్ వార్నింగ్‌లు ఇస్తున్నారు. నియోజకవర్గాల్లో పర్యటించేంత తీరిక లేకుంటే వేరొకరికి బాధ్యతలు అప్పగిస్తామన్న హెచ్చరికలు కూడా అధినేత జారీ చేస్తున్నారు. మార్పు రాకుంటే ఎవరిని ఉపేక్షించేది లేదని సమయాన్ని వృధా చేస్తే పరిణామాలు సీరియస్‌గా ఉంటాయని వార్నింగ్ ఇస్తున్నారు. ఇప్పటికే తాజాగా జరిగిన సమీక్షలో నెల రోజుల్లో నేతల పనితీరు మారాలని మార్పు రానిపక్షంలో తాను ఏం చేయాలో చూపిస్తానని నేతలకు స్పష్టం చేశారు. ఇదే సమయంలో పార్టీ కేడర్‌తో పాటు దిగువస్థాయి నేతలతో ముఖ్యనేతల సంబంధాలు ఎలా ఉన్నాయన్న అంశంపై కూడా అధిష్ఠానం ఆరా తీస్తోంది. గతంలోని మూస విధానాలకు స్వస్తి పలికిన తెదేపా అధిష్ఠానం కొత్త కార్యాచరణతో ముందుకు వెళ్తూ నియోజకవర్గాలపై ఒక కన్ను వేసింది. పార్టీ రహస్య బృందాలు సాధారణ వ్యక్తుల్లా గ్రామాలు, నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సేకరించిన వివరాలతో సమగ్ర నివేదికలను నేరుగా అధినేత చంద్రబాబుకే ఈ టీమ్‌లు అందిస్తున్నాయి. నేతలతో జరుగుతున్న సమీక్షల్లో సైతం చంద్రబాబు పార్టీ తరుపున చేస్తున్న సర్వేలపై, తనకు అందిన నివేదికలపై కూడా నేతలకు కొన్ని హింట్లు ఇస్తున్నారు. పనితీరు మార్చుకోవాలని సూచిస్తూనే మరోవైపు కొంత కఠినంగానే వ్యవహరిస్తున్నారు.

# ప్రజల పార్టీ తెలుగుదేశం పార్టీ

చందోలు (పిట్టలవానిపాలెం - ప్రజాపాలన) : ప్రజల పార్టీ తెలుగుదేశం పార్టీ అని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, బాపట్ల టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని పోలీస్ స్టేషన్ ప్రక్కన తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణకు ఆదివారం ముఖ్యఅతిథిగా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర, బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు.ముందుగా శ్రీ భగలాముఖి దేవాలయం నందు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయడంక మొగుతుందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని ఈ ప్రభుత్వంపై ప్రజలందరూ విసిగిపోయారన్నారు.ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అబ్జాల్, బాపట్ల పార్లమెంటు మైనారిటీ అధ్యక్షులు ఖాసిం, గ్రామ పార్టీ అధ్యక్షులు



రజాక్,నాయకులు మీరా,మజహార్ భాష, గౌస్, అన్వార్, మరియు మండలం కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# టాలెంటెడ్ దర్శకుడికి నాని గ్రీన్ సిగ్నల్?



నేచురల్ స్టార్ నాని 'అంటే సుందరానికి' సినిమా రీసెంట్గా భారీ స్థాయిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఒక విధంగా ఈ సినిమాకు కొంత పాజిటివ్ టాక్ వచ్చినప్పటికీ కూడా బాక్సాఫీస్ వద్ద మాత్రం ఊహించని విధంగా కలెక్షన్స్ అందుకుంటోంది. అసలు నాని స్టార్ హీరోగా ఎదిగిన తర్వాత అత్యధిక తక్కువ ఓపెనింగ్స్ అందుకున్న సినిమాగా 'అంటే సుందరానికి' నిలిచింది. అసలు ఈ రేంజ్ లో అతి తక్కువ ఓపెనింగ్స్ వస్తాయని ఎవరూ ఊహించలేదు. పైగా అంతకుముందు రోజే పవన్ కళ్యాణ్ సినిమాకు సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ప్రత్యేక అతిథిగా వచ్చిన విషయం తెలిసిందే. అలాగే సినిమా ప్రమోషన్స్ కూడా బాగానే చేసినప్పటికీ కూడా ఏమాత్రం ఉపయోగపడలేదు. మొత్తానికి నాని నుంచి ఒక మంచి కామెడీ సినిమా అయితే వచ్చింది. ఇక ఆ తర్వాత ఎలాంటి సినిమాలు చేస్తాడు అనే విషయంలో కూడా అనేక రకాల కథనాలు వెలువడుతున్నాయి.ప్రస్తుతం తన 29వ సినిమాను శ్రీకాంత్ అనే కొత్త దర్శకుడితో చేస్తున్న విషయం తెలిసిందే. దసరా అనే ఆ సినిమాలో నాని గతంలో ఎప్పుడూ లేని విధంగా సరికొత్త మాస్ లుక్ తో కనిపిస్తున్నాడు. ఇంకా సగానికి పైగా ఆ సినిమా షూటింగ్ అయితే పూర్తిచేయాల్సి ఉంది. ప్రస్తుతం నాని మరో కొత్త ప్రాజెక్ట్ చేసేందుకు ఓకే చర్చలు జరుపుతున్నట్లు కూడా తెలుస్తోంది.కేరాఫ్ కంచరపాలెం అనే సినిమాతో మంచి గుర్తింపును అందుకున్న వెంకటేష్ మహా ఇటీవల నానికి ఒక భిన్నమైన కథను చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ దర్శకుడు ఇంతకుముందు డైరెక్ట్ చేసిన ఉమామహేశ్వర ఉగ్రరూపశ్య డైరెక్ట్ గా ఓటీటీ లోనే విడుదల అయింది. కానీ ఆ సినిమా అంతగా వర్కవుట్ కాలేదు. ఇక నానికి చెప్పిన స్టోరీ అయితే దాదాపు ఓకే అయ్యేలా ఉందని తెలుస్తోంది. ఇదివరకే కొన్ని కథలు చర్చల దశలో ఉన్నప్పటికీ నాని ఈ ప్రాజెక్టును తన 30 సినిమా చేయాలని ఆలోచిస్తున్నారట. ఇక దర్శకుడి తో మరోసారి ఫైనల్ స్క్రిప్టుపై కూడా చర్చలు జరిపే అవకాశం ఉంది. ఒకవేళ ఫైనల్ అయితే అఫీషియల్ అనౌన్స్మెంట్ కూడా ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## తెలుగులో సాలిడ్ మార్క్ కి చేరుకున్న "విక్రమ్" వసూళ్లు.?




లోక నాయకుడు కమల్ హాసన్ హీరోగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి అలాగే ఫహద్ ఫాజిల్ ఇంకా స్టార్ హీరో సూర్య లు కీలక పాత్రల్లో నటించిన లేటెస్ట్ చిత్రం "విక్రమ్ హిట్ లిస్ట్". దర్శకుడు లోకేష్ కనగ్ రాజ్ తెరకెక్కించిన ఈ సాలిడ్ యాక్షన్ డ్రామా మన తెలుగులో కూడా భారీ హిట్ అయ్యింది.ఈ ఏడాదికి అయితే ఇప్పటి వరకు తమిళ్ నుంచి తెలుగులోకి వచ్చిన చిత్రాల్లో హైయెస్ట్ గ్రాసర్ గా నిలిచి ఇంకా మంచి వసూళ్లను అందుకుంటూ దూసుకెళుతుంది. అయితే లేటెస్ట్ గా ఈ సినిమా తెలుగులో 25 కోట్ల గ్రాస్ సాలిడ్ మార్క్ ని క్రాస్ చేసినట్టుగా సినీ వర్గాలు చెబుతున్నాయి.చాలా కాలం తర్వాత కమల్ సినిమాకి మన తెలుగులో ఇదే అత్యధికం అని చెప్పాలి. మై ఫైనల్ రన్ లో అయితే ఈ చిత్రం ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే. ఇక ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందించగా కమల్ మరియు మహేంద్రన్ లు నిర్మాణం వహించారు.

# మెగాస్టార్ ఇంట్లో కమల్, సల్మాన్



మెగాస్టార్ చిరంజీవి ఇతర స్టార్స్ తో ఎలాంటి సాన్నిహిత్యంతో ఉంటాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా ఇతర ఇండస్ట్రీలోని అగ్ర హీరోలు కూడా మెగాస్టార్ తో ఎంతో ఫ్రెండ్లీగా ఉంటారు. ఇక మెగాస్టార్ చిరంజీవి కి ఒక సినిమా నచ్చింది అంటే వెంటనే ఆ చిత్ర యూనిట్ సభ్యుల ను కూడా ప్రత్యేకంగా గౌరవిస్తూ ఉంటారు. రీసెంట్గా విక్రమ్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో విశ్వనటుడు కమల్ హాసన్ ప్రత్యేకంగా తనదైన శైలిలో గౌరవించారు. అందుకు సంబంధించిన ఫోటోలను కూడా మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకున్నాడు. గత రాత్రి కమల్ హాసన్ సల్మాన్ ఖాన్ మా ఇంటికి విచ్చేశారు అంటూ ఈ సందర్భంగా వారిని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది అని వివరణ ఇచ్చారు. ఇక విక్రమ్ సినిమా మంచి విజయాన్ని అందుకున్న సందర్భంగా ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కమల్ హాసన్ తో పాటు బాలీవుడ్ నటుడు కమల్ హాసన్ కూడా రావడంతో మెగాస్టార్ ఆనందంతో ఇద్దరిని కూడా తనదైన శైలిలో రిసీవ్ చేసుకున్నారు. సినిమా అద్భుతంగా ఉంది అనే కమల్ హాసన్ కు ఇలాంటి విజయాలు మరెన్నో కలగాలని మరీంత పవర్ఫుల్ గా కూడా ఉండాలి అని మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవితో కమల్ హాసన్ కి ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంది. మీరు గతంలో కొన్ని సినిమాలు కూడా కలిసి చేయాలని అనుకున్నారు. మధ్యలో అయితే తెలుగు లో కమల్ హాసన్ మెగాస్టార్ చిరంజీవి తో కలిసి నటించాలని ఉంది అని కూడా వివరణ ఇచ్చారు. ఇక మెగాస్టార్ పోస్ట్ చేసిన ఫోటోలు కమల్ హాసన్ సల్మాన్ ఖాన్ కూడా కనిపించడంతో పాండ్యా ఫోటో చూసినట్లుగా ఉంది అని ప్రేక్షకులు స్పందిస్తున్నారు. ఈ ముగ్గురి కలయికలో సినిమా వస్తే బాక్సాఫీస్ షేక్ అవుతుందని కూడా వారి ఆనందాన్ని షేర్ చేసుకుంటున్నారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి సల్మాన్ ఖాన్ గాడ్ ఫాదర్ సినిమాలో ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే. ఆ సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పవన్ రహస్యంగా ఆ ప్రాజెక్ట్ ని సెట్ చేస్తున్నారా?



మొత్తానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మళీ ఫాంలోకి వచ్చేసారు. భీమ్లా నాయక్ సక్సెస్ తో పీకే ఇమేజ్ ఏం చెక్కు చెదర్లేదని క్లారిటీ వచ్చేసింది. వరుస ఫ్లాప్ ల నేపథ్యంలో పీకే మార్కెట్ డౌన్ పాల్ లో ఉందన్న అపవాదను భీమ్లా నాయక్ తుడిచిపెట్టేసింది. దాదాపు నాలుగైదేళ్ల తర్వాత వచ్చిన అసలైన సక్సెస్ గా తెలుస్తోంది.వరుస రీమేక్ లు ..స్ట్రెయిట్ స్టోరీలు సైతం పీకేని కాస్త కిందా మీదా చేసినట్లు కనిపించినా భీమ్లా పంచ్ దెబ్బకి అన్ని సెట్ అయిపోయాయి. ప్రస్తుతం పీకే ఫుల్ జోష్ లో ఉన్నారు. అదే ఉత్సాహంలో ఆ మధ్య తమిళ చిత్రం వినోదయ సీతంని సైతం రీమేక్ చేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగిన సంగతి తెలిసిందే.అందులో నటించి..దర్శకత్వం వహించిన సముద్ర ఖనిని పీకే దర్శకుడిగాను ఎంపిక చేసినట్లు మీడియా అంతకంతకు వేడెక్కించింది. కానీ అది ఎంతో కాలం కొనసాగలేదు. ఆ వేడి ఒక్కసారిగా చల్లబడింది. పీకే బిజీ షెడ్యూల్ సహా..2024 ఎన్నికలకు సమయం తక్కువ ఉండటంతో వినోదయ సీతంని లైట్ తీసుకున్నారనే ప్రచారం సాగింది.కానీ తాజా అప్ డేట్ మళ్లీ పీకే మనసు ఆ సినిమాని వదలడం లేదని సమాచారం. సినిమా కోసం పీకే 20 రోజులు కాల్షీట్లు కేటాయించారని.. రహస్యంగా రైట్స్ తీసుకుని ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలు పెట్టేసినట్లు వినిపిస్తుంది. మాతృకలో నటించిన తంబి రామయ్య పాత్రని మెగా మేనల్లుడు సాయి తేజ్ పీకే పవన్ కి ఆఫర్ చేసినట్లు వెలుగులోకి వస్తుంది.ఆ పాత్రకి హీరోయిన్ గా కృతిశెట్టిని గానీ..శ్రీలీలని గానీ తసుకోవాలన్న ఆలోచన సైతం ఉందిట. మరి ఇందులో నిజమెంతో తెలియదు గానీ..ప్రచారం మాత్రం తారెత్తి పోతుంది. ఓ సారి వాస్తవాన్ని గ్రహిస్తే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా క్రిష్ దర్శకత్వంలో హరి హర వీరమల్లు తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఇప్పటి వరకూ పవన్ పూర్తి చేయలేకపోయారు.గ్యాప్ తీసుకుని షూటింగ్ కి హాజరవుతున్నారు. అటు హరీష్ శంకర్ ఇచ్చిన మాటని ఇంకా నిలబెట్టుకోలేదు. భవదీయుడు భగత్ సింగ్ ప్రాజెక్ట్ కమిట్ అయిన తర్వాత షూటింగ్ ప్రారంభించడానికే టైమ్ దొరకకుండా ఉంది. అలాంటి పవన్ ఇప్పుడు ఇంత బిజీ షెడ్యూల్ నడుమ ముందున్న వాటి సంగతి చూడకుండా కొత్త రీమేక్ జోలికి ఎందుకు వెళ్తారు? అన్న సందేహం రాక మానదు. అయితే కథ మరీ అంతంగా నచ్చితే చేసేదేం లేదు. వెనుక ముందవుతుంది..ముందు వెనుకవుతుంది. మరి అలాంటలి మిరాకిల్ ఏదైనా జరిగితేనే పీకే ముందువాటినికి వెనక్కి తోసి ముందుకెళ్తూ ఉండొచ్చు.

# చరణ్ పై మనసు పడ్డ అమెరికన్ ఎడిటర్



తెలుగు రాష్ట్రాల్లో ఎంత ఫాలోయింగ్ ఉన్నా అమెరికా లాంటి చోటా రికార్డులు బ్రేక్ చేస్తేనే ఆ స్టార్ కి ఉండే గుర్తింపు రెట్టింపు అయినట్టు. అమెరికా బాక్సాఫీస్ మరో నైజాంగా మారిన క్రమంలో అక్కడ పాపులారిటీ కోసం మన స్టార్లు ఎక్కడా తగ్గడం లేదు. అమెరికా బాక్సాఫీస్ ని ఉద్దేశించి కూడా కథల్ని ఎంపిక చేసుకుంటున్నారు. అయితే దర్శకధీరుడు రాజమౌళితో పని చేసే స్టార్లకు ఇలాంటి అవసరం ఉండదు.ఇప్పుడు రాజమౌళి మరో ఇద్దరు పాన్ ఇండియన్ స్టార్లను తయారు చేసారు. రామ్ చరణ్ .. తారక్ లకు హిందీ బెల్ట్ తో పాటు అమెరికాలోనూ ఫాలోయింగ్ పెంచడంలో అతడి సహకారం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఆర్.ఆర్.ఆర్ లో రామ్ చరణ్ ని పవర్ ఫుల్ కాప్ పాత్రలో ఆవిష్కరించిన తీరు నభూతోన భవిష్యతి అని చెప్పాలి. ఆ పాత్ర చరణ్ కి అమెరికాలో అసాధారణ ఫాలోవర్స్ ని పెంచిం ది. అమెరికా లో ఆర్.ఆర్.ఆర్ కి గొప్ప ఆదరణ దక్కింది. అలాగే అక్కడ చరణ్ పాత్ర పొందుతున్న ప్రశంసలు నిజంగా అద్భుతమైనవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. పాపులర్ మ్యాగజైన్ ఇన్ సైడర్ కరస్పాండెంట్ కిర్ స్టైన్ అకునా.. తాను రామ్ చరణ్ కి వీరాభిమానిని అయ్యానని ట్వీట్ చేసింది. అతను తన కొత్త క్రష్ అని ప్రకటించింది. తన టైమ్ లైన్ ను అనుసరిస్తూ అమెరికా నుండి చాలా మంది మహిళా ప్రేక్షకులు ప్రస్తుతం చరణ్ తమ సరికొత్త హృదయ స్పందన అని ట్వీట్ చేస్తున్నారు. అంతేకాదు.. ఆర్ఆర్ఆర్ నెట్ ఫ్లిక్స్ వెర్షన్ నుండి స్క్రీన్ షాట్ లను షేర్ చేస్తూ హార్ట్ ఈవెూజీలను షేర్ చేస్తున్నారు.రామ్ చరణ్ పోషించిన రామ్ పాత్ర అంత బాగా యుఎస్ మహిళలకు కనెక్టయ్యింది. ఈ పాత్రను రాజమౌళి డిజైన్ చేసిన విధానం అంత పవర్ ఫుల్ గా ఉంది. చరణ్ ఇంట్రడక్షన్ సీన్ కానీ.. సినిమా చివరి ఎపిసోడ్ లో యాక్షన్ దృశ్యాలు కానీ.. ప్రతిదీ ఆకట్టుకున్నాయి. ఈ అంశాలన్నీ రామ్ చరణ్ ను హాలీవుడ్ సెలబ్రిటీలలో ఫేవరెట్ గా మారుస్తున్నాయి. అయితే ఇదే అదనుగా అతడు హాలీవుడ్ మార్కెట్ పైనా దృష్టి సారించాలని సూచిస్తున్నారు కొందరు. ప్రపంచీకరణ నేపథ్యంలో మార్కెట్లో వస్తువును ఎక్కడైనా సులువుగా అమ్మేయొచ్చు. క్రేజ్ ఉండగానే అన్నిచోట్లా ఆర్జించాలి. దీనికోసం గేమ్ ని మార్చాలని సూచిస్తున్నారు. కానీ చరణ్ ఆ పని చేస్తారా? లేదూ నేను ఇంకా తెలుగు హీరోనే.. ఏదో ఇరుగు పొరుగు భాషల వరకే పరిమితం అని సరిపెట్టుకుంటాడా? గ్లోబల్ మార్కెట్లపై దృష్టి సారిస్తాడా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఇక హాలీవుడ్ లో నటించాలంటే అక్కడా తనకు పీఆర్ బలంగా ఉండాలన్నది తెలిసిందే. అన్నట్టు హాలీవుడ్ తో బాగా కనెక్షన్ ఉన్న జంజీర్ సహనటి ప్రియాంక చోప్రా సాయం చరణ్ కోరితే బావుంటుందేమో?!

# "ఖైదీ 2" పై వైరల్ అవుతున్న ఇంట్రెస్టింగ్ వార్తలు.!




కోలీవుడ్ లో బిగ్గెస్ట్ హిట్స్ అయినటువంటి చిత్రాల్లో సైలెంట్ గా వచ్చి వైలెంట్ హిట్ అయ్యిన చిత్రం "ఖైదీ" కూడా ఒకటి. దర్శకుడు లోకేష్ కనగ్ రాజ్ మరియు హీరో కార్తీ ల కాంబోలో వచ్చిన ఈ చిత్రం తమిళ్ తో పాటు తెలుగులో కూడా భారీ హిట్ అయ్యింది. అయితే ఇప్పుడు లోకేష్ తెరకెక్కించిన మరో భారీ హిట్ "విక్రమ్" కి దీనికి లింక్ చేస్తూ చూపించడంతో ఆడియెన్స్ చాలా ఎగ్జైట్ అయ్యారు.దీనితో పాటుగా ఇప్పుడు విక్రమ్ 2 కన్నా ముందు ఖైదీ 2 పై అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. మరి ఈ సినిమాపై ఇప్పుడు ఇంట్రెస్టింగ్ వార్తలే వినిపిస్తున్నాయి. ఈ సినిమా అయితే ఫస్ట్ పార్ట్ కన్నా పదింతలు సాలిడ్ గా ఉంటుందట.అంతే కాకుండా దీనిని నెక్స్ట్ పాన్ ఇండియా లెవెల్ సినిమాగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. అంతే కాకుండా మాసివ్ గా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని తెలుస్తుంది. బడ్జెట్ కూడా భారీ పెట్టనున్నట్టు టాక్. అలాగే ఈ చిత్రాన్ని లోకేష్ నెక్స్ట్ విజయ్ తో చేసే సినిమా అనంతరం స్టార్ట్ చేయనున్నాడట.


SNEHA CLUB — PAY BACK TO SOCIETY | SNEHA MACS

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com